ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

ఆదివారం | 19-04- 2026 | సంపుటి: 17, సంచిక : 17, నిజామాబాద్, పేజీలు : 12, వెల : 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

## మహిళల కలలను

# చిదిమేశారు



## విపక్షాలపై ప్రధాని మోదీ నిప్పులు!

### మహిళా రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు

### బిల్లును అడ్డుకోవడం విపక్షాలచారిత్రక తప్పిదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల బిల్లు పాస్ కాకపోవడంపై భారత మహిళలందరినీ క్షమాపణ కోరుతున్నాను. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, సమాజ్‌వాదీ వంటి పార్టీల స్వార్థ రాజకీయాల కారణంగా దేశ మహిళలకు తీవ్ర నష్టం కలిగింది. పార్లమెంటులో మహిళా బిల్లు వీగిపోగానే ఆ పార్టీల వాళ్లు ఆనందంతో బల్లలు చరిచారు. అది బల్లలు చరవడం కాదు మహిళల ఆత్మగౌరవంపై జరిగిన దాడి. అది చూసి చాలా బాధ కలిగింది. మహిళలు అన్నీ గమనిస్తున్నారు. వారిని కచ్చితంగా శిక్షిస్తారు. భారత నారీ శక్తిని ఎదగనీయకుండా కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. ప్రతిపక్షాలు కుటిల రాజకీయాలతో దేశ మహిళల కలలను కల్లలు చేశాయని మండిపడ్డారు. వారి తీరుపట్ల భారత మహిళలకు తాను క్షమాపణ చెబుతున్నట్టు పేర్కొన్నారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులు వీగిపోయిన నేపథ్యంలో మోదీ శనివారం జాతినుద్దేశించి 30 నిమిషాల పాటు ఉద్వేగంగా ప్రసంగించారు. ఈ క్రమంలో కాంగ్రెస్‌తోపాటు టీఎంసీ, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీల పేర్లను ప్రస్తావిస్తూ ఘాటుగా విమర్శలు చేశారు. “కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మహిళల శక్తిని తక్కువగా అంచనా వేశాయి. మహిళలు దేనినైనా మర్చిపోవచ్చు. కానీ తమకు జరిగిన అవమానాన్ని ఎన్నటికీ మర్చిపోరు. వారు అన్నీ గమనిస్తున్నారు. కచ్చితంగా శిక్షిస్తారు. ఎప్పుడైనా ఈ నేతలు వారికి కనిపించినప్పుడు మహిళల రిజర్వేషన్ ఆశలను నాశనం చేసినవారు వీరేనని.. పార్లమెంటులో ఆనందంతో బల్లలు చరిచారని గుర్తు చేసుకుంటారు” అని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే, టీఎంసీ ఎప్పుడూ ఏదో ఒక సాంకేతిక కారణాన్ని అడ్డుపెట్టుకుని మహిళల హక్కులను దోచుకుంటూ వస్తున్నాయని మండిపడ్డారు.

మహిళా శక్తి బలోపేతమైతే ఎక్కడ వారి వారసత్వ రాజకీయాలకు, నాయకత్వానికి ముప్పు వస్తుందోననేదే వారి భయమని పేర్కొన్నారు. చిన్న రాష్ట్రమైనా, పెద్ద రాష్ట్రమైనా సరే.. ప్రతి రాష్ట్రానికి 50శాతం పార్లమెంటు సీట్లను ఇవ్వడానికి సిద్ధమయ్యా మని మోదీ చెప్పారు. “మహిళా బిల్లు, డీలిమిటేషన్‌కు సంబంధించి గొప్పతనాన్ని కూడా ప్రతిపక్షానికి ఇవ్వడానికి సిద్ధమని చెప్పాం. అయినా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మొత్తం దేశం చూస్తుండగానే.. మా నిజాయతీ ప్రయత్నాన్ని భ్రూణ హత్య చేశాయి.

తరువాయి 2వ పేజీలో...




## హర్మూజ్ వద్ద

# ఉద్రిక్తతలు

### తెరిచిన గేట్లు మూత

- ఇరాన్ కఠిన నిర్ణయం ప్రపంచాన్ని కుదిపింది
- రెండు రోజులకే మళ్లీ జలసంధి మూసివేత
- అమెరికా నేవీ దిగ్బంధనంపై ఇరాన్ ఆగ్రహం
- మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్త వాతావరణం
- ఆయిల్ సరఫరాలపై తీవ్ర ప్రభావం సూచనలు
- అంతర్జాతీయ మార్కెట్లలో ఆందోళన
- వ్యూహాత్మక మార్గంపై కఠిన నియంత్రణ
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం అవకాశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:
మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగేలా ఇరాన్ తీసుకున్న తాజా నిర్ణయం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. కేవలం రెండు రోజుల క్రితమే ఈ మార్గాన్ని తిరిగి తెరిచిన ఇరాన్, ఇప్పుడు మరింత కఠిన నియంత్రణలు అమలు చేస్తూ ఆ మార్గాన్ని మళ్లీ పరిమితం చేయడం అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ఇరాన్ ప్రకటన ప్రకారం, తమ నౌకల రాకపోకలపై అమెరికా నేవీ విధిస్తున్న దిగ్బంధనమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని పేర్కొంది.

తరువాయి 2వ పేజీలో...

# ఉగ్ర కుట్ర భగ్నం



### దేశవ్యాప్తంగా పేలుళ్లకు భారీ ప్రణాళికను ఛేదించిన పోలీసులు

- మూడు రాష్ట్రాల్లో నలుగురు అనుమానితుల అరెస్ట్
- టాయ్ కార్లలో ఐఈడీ అమర్చి దాడులకు కుట్ర
- ఎన్క్రిప్టెడ్ ప్లాట్‌ఫార్మ్‌ల ద్వారా రిక్రూట్మెంట్ యత్నాలు
- ఖలీఫా భావజాలంతో ప్రభావితులైన నిందితులు
- ఐఈడీ సామాగ్రి, డిజిటల్ పరికరాల స్వాధీనం
- క్యూఆర్ కోడ్‌ల ద్వారా నిధుల సేకరణ ప్రయత్నాలు
- కీలక ప్రాంతాలపై దాడులకు ప్రణాళికల అనుమానం

2లో

### తమిళనాడులో తిరిగి డిఎంకె కూటమిదే

# అధికారం

- లౌకికవాదం కోసం తమిళ ప్రజలు ముందుంటారు
- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



2లో

# రేవంత్ ఫైర్



### మహిళా రిజర్వేషన్ పేరుతో డీలిమిటేషన్ కుట్ర అంటూ సీఎం రేవంత్ ఆరోపణ

- బీజేపీ అసలు అజెండా రాజ్యాంగ మార్పులేనని ఘాటు వ్యాఖ్యలు
- మూడు బిల్లుల వెనుక రాజకీయ లెక్కలు ఉన్నాయన్న విమర్శ
- దక్షిణ రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశంపై ఆందోళన
- మహిళా కోటను వేరుగా అమలు చేయాలని స్పష్టమైన డిమాండ్
- విపక్షాల ఐక్యతతో కేంద్రానికి గట్టి ఎదురుదెబ్బ అని వ్యాఖ్య
- 400 సీట్లు వస్తే రాజ్యాంగం మారేదని రేవంత్ హెచ్చరిక
- ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రజాకలం) :
కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడిన తీరు పూర్తిగా దూకుడుగా, విమర్శల వర్షం కురిపించేలా సాగింది.

మహిళా రిజర్వేషన్ బిల్లును నిజాయితీగా తీసుకురాలేకపోయిన కేంద్ర ప్రభుత్వం, దాని వెనుక దాగి ఉన్న అసలు ఉద్దేశాన్ని దాచిపెట్టాలని ప్రయత్నించిందని ఆయన ఘాటుగా విమర్శించారు. మహిళల సాధికారత పేరుతో ప్రజలను మోసం చేస్తూ, డీలిమిటేషన్ అమలుకు మార్గం సుగమం చేయడమే కేంద్రం లక్ష్యమని రేవంత్ రెడ్డి ఆరోపించారు. మూడు బిల్లుల పేరుతో దేశ రాజకీయ వ్యవస్థను మలుపుతిప్పే కుట్ర జరుగుతోందని, ఇది సాధారణ చట్టపరమైన ప్రక్రియ కాదని, రాజ్యాంగాన్ని బలహీనపరిచే ప్రమాదకర ప్రయత్నమని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. “మహిళల హక్కుల పేరుతో ముసుగు వేసుకుని అసలు అజెండాను అమలు చేయాలనుకోవడం

తరువాయి 2లో...

# జగిత్యాల జైత్రయాత్ర



- కేసీఆర్ సభకు అఖిల స్థాయి ఏర్పాట్లు
- జగిత్యాలలో పండుగ వాతావరణం నెలకొల్పిన బీఆర్ఎస్
- ప్రజా ఆశీర్వాద సభపై కేటీఆర్ విశదీకరణ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు
- రేవంత్ రాజకీయాలపై కేటీఆర్ ఫైర్
- భారీ జనసంద్రం అంచనా - లక్షల సంఖ్యలో హాజరు
- మూడు లక్షల నీటి బాటిల్స్, రెండు లక్షల మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం
- జీవన్ రెడ్డి చేరికతో ఉత్సాహం రెట్టింపు
- నియోజకవర్గాల వారీగా బాధ్యతల పంపిణీ
- కార్యకర్తలకు సంయమనం, సమన్వయం పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రజాకలం) :
జగిత్యాల జిల్లాలో ఏప్రిల్ 20న నిర్వహించనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు సంబంధించి భారీ స్థాయిలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. సభ ప్రాంగణాన్ని స్వయంగా సందర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ నాయకులతో

తరువాయి 2వ పేజీలో...

# కవిత అల్టిమేటం

### చలో సెక్రటేరియట్‌కు బయల్దేరిన ఉద్యమకారుల అరెస్ట్



- పలు పోలీస్ స్టేషన్లకు తరలించిన పోలీసులు
- మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌లో కవిత పరామర్శ
- విడుదలయ్యే వరకు కదిలేది లేదని కవిత స్పష్టం
- హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యంపై విమర్శలు
- భూమి, పెన్షన్ వెంటనే ఇవ్వాలని డిమాండ్
- అవసరమైతే భూపోరాటాలకు సిద్ధమని హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రజాకలం) :
హైదరాబాద్‌లో జరిగిన “చలో సెక్రటేరియట్” ఆందోళన సందర్భంగా అరెస్ట్ అయిన తెలంగాణ ఉద్యమకారులను విడుదల చేయించడంలో కల్వకుంట్ల కవిత కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం పెద్ద ఎత్తున ఉద్యమకారులు సెక్రటేరియట్‌కు బయల్దేరగా, పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన ఉద్యమకారులను మెహదీపట్నం, నాంపల్లి, పంజాగుట్ట తదితర పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న కవిత నేరుగా మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని అరెస్టైన వారిని పరామర్శించారు. ఉద్యమకారులను పూర్తిగా విడుదల చేసే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని ఆమె స్పష్టం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

తరువాయి 2వ పేజీలో...

# హార్మూజ్ వద్ద ఉద్రిక్తతలు

మొదటి పేజీ తరువాయి...

అమెరికా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని, తమ సముద్ర రవాణాపై అనవసర ఆంక్షలు కొనసాగుతున్నాయని తీవ్రంగా విమర్శించింది. ఈ నేపథ్యంలో తమ జలసం ధిపై పూర్తి నియంత్రణను కొనసాగిస్తామని, పరిస్థితులు మారే వరకు ఈ విధానంలో ఎలాంటి సడలింపులు ఉండవని ఇరాన్ సైనిక వర్గాలు స్పష్టం చేశాయి. ఇటీవల ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తరువాత ప్రాంతంలో కొంత శాంతి నెలకొన్నట్లు కనిపించింది. ఆ నేపథ్యంలోనే ఇరాన్ హార్మూజ్ మార్గాన్ని తిరిగి తెరిచింది. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో పూర్తి స్థాయి ఒప్పందం కుదిరే వరకు నేవీ చర్యలు కొనసాగుతాయని ప్రకటించడంతో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్త దశకు చేరుకున్నాయి. పర్షియన్ గల్ఫ్ ప్రాంతం నుంచి ప్రపంచానికి జరిగే ఆయిల్ సరఫరాల్లో హార్మూజ్ జలసంధి కీలక పాత్ర పోషిస్తుంది. ప్రపంచ ఆయిల్ రవాణాలో సుమారు 20 శాతం ఈ మార్గం ద్వారానే జరుగుతుండటంతో, ఈ మార్గం మూసివేత అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. ఇప్పటికే గ్లోబల్ ఆయిల్ ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇరాన్ చర్యతో గల్ఫ్ దేశాలు అప్రమత్తమవుతున్నాయి. ముఖ్యంగా ఆయిల్ ఎగుమతులపై ఆధారపడే దేశాలకు ఇది పెద్ద సవాల్‌గా మారే అవకాశం ఉంది. సముద్ర మార్గాల్లో భద్రతా పరిస్థితులు క్షీణించే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

ఇక అంతర్జాతీయ రాజకీయ వేదికపై కూడా ఈ పరిణామం పెద్ద చర్చకు దారితీస్తోంది. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితి దీర్ఘకాలంగా కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా, హార్మూజ్ జలసంధి మళ్లీ మూసివేతతో మధ్యప్రాచ్యంలో స్థిరత్వం ప్రశ్నార్థకంగా మారింది. రాబోయే రోజుల్లో ఈ సంక్షోభం ఎలా మలుపుతీసుకుంటుందో ప్రపంచం ఉత్కంఠగా గమనిస్తోంది.

# మహిళల కలలను చిదిమేశారు

మొదటి పేజీ తరువాయి...

డీలిమిటేషన్‌పై ప్రతిపక్షాలు అవాస్తవాలు చెబుతున్నాయి. ఈ అంశాన్ని ఉపయోగించుకుని విభజన రాజకీయాలను రెచ్చగొట్టాలని ప్రయత్నిస్తున్నాయి. కాంగ్రెస్ ఈ 'విభజించు–పాలించు' విధానాన్ని బ్రిటీషర్ల నుంచి వారసత్వంగా తీసుకుంది. కాంగ్రెస్ తన దశాబ్దాల తప్పును దిద్దుకుంటుందని, పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకుంటుందని భావించాను. కానీ మహిళలకు మద్దతుగా నిలిచే సదవకాశాన్ని పోగొట్టుకుంది. కాంగ్రెస్ దేశంలోని చాలా ప్రాంతాల్లో ఉనికి కోల్పోయింది. పరాన్నజీవిలా ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి బతుకుతోంది. ఆ ప్రాంతీయ పార్టీలు బలపడాలని కోరుకోవడం లేదు. అందుకే వాటినిఈ బిల్లులకు వ్యతిరేకంగాముందు నిలబెట్టింది"అని అన్నారు.

**అన్ని సమస్యలకు మూలం కాంగ్రెసే..**

ఏ సంస్కరణలు వచ్చినా అబద్ధాలు చెప్పడం, అపోహలు వ్యాప్తి చేయడం కాంగ్రెస్‌కు అలవాటని మోదీ మండిపడ్డారు. మనతో పాటే చాలా దేశాలకు స్వాతంత్ర్యం వచ్చిందని.. చాలా దేశాలు మనను దాటి ఎంతో ముందుకు వెళ్లిపోయాయ చెప్పారు. సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించడమే దానికి కారణమన్నారు. "కాంగ్రెస్ సంస్కరణల వ్యతిరేక పార్టీ. ఆలస్యం చేయడం, తప్పుదారి పట్టించడం, అడ్డుకోవడం కాంగ్రెస్ మూల సూత్రం. దేశ సరిహద్దు వివాదాలను పెండింగ్‌లో పెట్టింది. పాకిస్థాన్‌తో నీటి పంపకం అంశాలను ఆలస్యం చేసింది. ఓబీసీ రిజర్వేషన్లపై నిర్ణయాన్ని 40 ఏళ్లు పెండింగ్‌లో పెట్టింది. జమిలి ఎన్నికలకు వ్యతిరేకం, అక్రమ వలసదారులను పంపేయడానికి వ్యతిరేకం, సీఏఏకు, సర్ ప్రక్రియకు వ్యతిరేకం. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న పెద్ద సమస్యలన్నీ కాంగ్రెస్ తీరుతో ఏర్పడినవే. అందువల్ల ఈ పోరాటం కేవలం చట్టం గురించే కాదు. కాంగ్రెస్ సంస్కరణల వ్యతిరేక మనస్తత్వంపై పోరాటం. ఒకాంగ్రెస్ కు దేశ మహిళలు గట్టిగా బుద్ధి చెబుతారన్నది నా నమ్మకం" అన్నారు.

**మేం ఓడినట్టు కాదు..** లోక్‌భలో మహిళా బిల్లు ఆమోదానికి అవసరమైన మూడింట రెండింతుల మెజారిటీ లేనంత మాత్రాన బీజేపీ ఓడిపోయినట్టు కాదని మోదీ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా మహిళల మద్దతు తమకు ఉందని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఉన్న ప్రతి అడ్డంకిని తొలగిస్తామని దేశంలోని మహిళలందరికీ హామీ ఇస్తున్నట్టు తెలిపారు.

**ప్రధాని ప్రసంగంలో నిస్పృహ: కాంగ్రెస్**

లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు వీగిపోయేలా చేశాయంటూ ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. నిరాశ, నిస్పృహలతో ప్రధాని ప్రసంగం సాగిందని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఎద్దేవా చేశారు. ప్రధాని ప్రసంగంలో కాంగ్రెస్‌ను 59 సార్లు ప్రస్తావించారని, మహిళల గురించి పెద్దగా ప్రస్తావించలేదన్నారు. ప్రధాని ప్రసంగం జాతిని ఉద్దేశించి చేసింది కాదని, కాంగ్రెస్‌ను తిట్టడానికి చేసినట్లుగా ఉందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చెప్పారు.

**ప్రతిపక్షాలు మూల్యం చెల్లించుకోవాల్సిందే**

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 131వ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో వీగిపోయేలా చేయడం ద్వారా విపక్షాలు తప్పు చేశాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలన్నీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. పార్లమెంట్ హౌస్‌లో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ప్రతిపక్షాలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని గ్రామగ్రామానికి తీసుకెళ్లాలని ప్రధాని మంత్రివర్గ సహచరులకు సూచించారు.

# రేవంత్ ఫైర్

మొదటి పేజీ తరువాయి...

ప్రజాస్వామ్యానికి ముప్పు" అని ఆయన స్పష్టం చేశారు. బీజేపీకి అవకాశం దొరికితే రాజ్యాంగాన్నే మార్చే ధోరణి ఉందని, గతంలో చేసిన ప్రయత్నాలు కూడా అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. "బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే దేశ రాజ్యాంగం పరిస్థితి ఏమయ్యేదో ఊహించుకోవాలి" అంటూ ప్రజలను అప్రమత్తం చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియను మహిళా రిజర్వేషన్లతో ముడిపెట్టడం వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాలను ఆయన బహిర్గతం చేశారు. ముఖ్యంగా దక్షిణ భారత రాష్ట్రాలపై అన్యాయం జరిగే విధంగా సీట్ల పునర్విభజన జరగొచ్చని, ఇది దేశ సమతుల్య అభివృద్ధికి విఘాతం కలిగిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విపక్షాలు స్పష్టంగా మహిళా రిజర్వేషన్ బిల్లును వేరుగా తీసుకురావాలని కోరినా, కేంద్రం పట్టించుకోలేదని రేవంత్ విమర్శించారు. "మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే పెద్ద పెద్ద సవరణలు అవసరం లేదు, చిన్న మార్పులతోనే అమలు చేయవచ్చు. కానీ కేంద్రం ఉద్దేశం అది కాదు" అని ఆయన అన్నారు. పార్లమెంట్‌లో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ, విపక్షాల ఐక్యతే కేంద్రానికి గట్టి చెక్ పెట్టిందని చెప్పారు. బిల్లు వీగిపోవడం కేవలం ఓటింగ్ ఫలితం కాదని, అది ప్రజాస్వామ్య విలువల విజయం అని ఆయన వ్యాఖ్యానించారు. ఇది రాజకీయ పార్టీల ఓటమి కాదు, బీజేపీ విధానాల ఓటమి అని స్పష్టం చేశారు. మొత్తంగా, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుల వెనుక ఉన్న అసలు ఉద్దేశాలను ప్రజలు అర్థం చేసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ఉగ్ర కుట్ర భగ్నం



## దేశవ్యాప్తంగా పేలుళ్లకు భారీ ప్రణాళికను ఛేదించిన పోలీసులు

- మూడు రాష్ట్రాల్లో నలుగురు అనుమానితుల అరెస్ట్
- టాయ్ కార్లలో ఐఈడీ అమర్చి దాడులకు కుట్ర
- ఎన్క్రిప్టెడ్ ప్లాట్‌ఫార్మ్‌ల ద్వారా రిక్రూట్మెంట్ యత్నాలు
- ఖలీఫా భావజాలంతో ప్రభావితులైన నిందితులు
- ఐఈడీ సామాగ్రి, డిజిటల్ పరికరాల స్వాధీనం
- క్యూఆర్ కోడ్‌ల ద్వారా నిధుల సేకరణ ప్రయత్నాలు
- కీలక ప్రాంతాలపై దాడులకు ప్రణాళికల అనుమానం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18;

దేశవ్యాప్తంగా పేలుళ్లకు పాల్పడే భారీ ఉగ్ర కుట్రను ఢిల్లీ పోలీసులు సమర్థంగా భగ్నం చేశారు. ఈ కేసులో భాగంగా మహారాష్ట్ర, ఒడిశా, బీహార్ రాష్ట్రాలకు చెందిన నలుగురు అనుమానితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా దేశంలో భయాందోళనలు సృష్టించి, పెద్ద ఎత్తున నష్టం కలిగించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు పోలీసులు వెల్లడించారు. ముఖ్యంగా టాయ్ కార్లలో ఐఈడీ అమర్చి జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో పేలుళ్లు జరపాలని కుట్ర పన్నారు. పోలీసుల దర్యాప్తులో ఈ నిందితులు ఆన్లైన్ ద్వారా తీవ్రవాద భావజాలానికి లోనైనట్లు తేలింది. ఖలీఫా రాజ్య స్థాపన, గజ్వాఏ హింద్ వంటి భావజాలాలతో ప్రభావితులై, దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలను విస్తరించాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీరు ఎన్క్రిప్టెడ్ డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లను ఉపయోగించి పరస్పరం సమాచారాన్ని పంచుకోవడంతో పాటు, కొత్త సభ్యులను ఉగ్రవాదంలోకి ఆకర్షించేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు. అరెస్టయిన నిందితులు మోసాయిబ్ అహ్మద్ (థానే), మహమ్మద్ అహ్మద్ (ముంబై), షేక్ ఇమ్రాన్ (భువనేశ్వర్), మహమ్మద్ సోహైల్ (కతిహార్, బీహార్)గా పోలీసులు గుర్తించారు. ఈ ముఠాలో సభ్యులు తమ తమ బాధ్యతలను విభజించుకుని పనిచేసినట్లు దర్యాప్తులో తేలింది. కొందరు ఐఈడీ తయారీకి అవసరమైన పదార్థాల సేకరణలో నిమగ్నమై ఉండగా, మరికొందరు రిక్రూట్మెంట్, ప్రచారం, శిక్షణ ప్రణాళికల రూపకల్పనపై దృష్టి సారించినట్లు వెల్లడైంది. దర్యాప్తు సందర్భంగా ఐఈడీ తయారీకి ఉపయోగించే సామగ్రి, మొబైల్ ఫోన్లు, కమ్యూనికేషన్ పరికరాలు, ఇతర డిజిటల్ ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అదేవిధంగా క్యూఆర్ కోడ్‌లు, బ్యాంకు ఖాతాల ద్వారా క్రౌడ్ ఫండింగ్ పద్ధతిలో నిధులు సేకరించే ప్రయత్నాలు చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ నిధులను ఉగ్ర కార్యకలాపాలకు వినియోగిం చేందుకు యత్నించినట్లు అనుమానిస్తున్నారు. డిసెంబర్ 2025లో ఢిల్లీలోని రెడ్ ఫోర్ట్, ఇండియా గేట్ వంటి కీలక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని రిక్కీ నిర్వహించినట్లు కూడా పోలీసులు భావిస్తున్నారు.

ఈ ఘటన ద్వారా దేశ రాజధానిలోనే పెద్ద ఎత్తున దాడులకు పూనుకునే యత్నం ఉన్నట్లు స్పష్టమవుతోంది. అలాగే నిందితులు కొన్ని ఆన్‌లైన్ మత ప్రసంగాలు, తీవ్రవాద ప్రచార కంటెంట్ ద్వారా ప్రభావితులైనట్లు దర్యాప్తులో తేలిందని అధికారులు పేర్కొన్నారు.

ఈ కేసులో మరిన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే ఇలాంటి కుట్రలను ముందుగానే అడ్డుకోవడం ద్వారా భారీ ప్రమాదాన్ని నివారించగలిగామని పేర్కొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూడా పోలీసులు సూచించారు.

# ఎస్ఎల్‌జీ రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం




అబ్దుల్లాపూర్ మెట్టు, ఏప్రిల్ 18

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్ మెట్టు మండలం, అబ్దుల్లాపూర్ గ్రామంలో ఎస్ఎల్‌జీ రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జింక వెంకటేష్ ముదిరాజ్ ఘనంగా ప్రారంభించారు. ఎండాకాలంలో పెరుగుతున్న తీవ్ర ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని గ్రామ ప్రజలకు, ప్రయాణికులకు శుద్ధమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జింక వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, వేసవికాలంలో తాగునీటి అవసరం అత్యంత ముఖ్యమైందని, ఇలాంటి చలివేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పెద్ద ఎత్తున ఉపశమనం కలిగిస్తాయని పేర్కొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ నీటి సదుపా యం వల్ల స్థానికులు, ప్రయాణికులు తాగు నీటి కొరత నుంచి కొంతవరకు ఉపశమనం పొందగలరని అన్నారు. సామాజిక సేవలో భాగంగా ఎస్ఎల్‌జీ రియల్ ఎస్టేట్ చేపట్టిన ఈ కార్యక్రమం ప్రశంసనీయం అని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్ర మంలో జింక నరేష్, బింగి బాలరాజ్ గౌడ్ ముదిరాజ్, కావలి జంగయ్య ముదిరాజ్, ఆకుల శ్రీనివాస్ గౌడ్, జింక యాదగిరి ము దిరాజ్, జింక గోవర్ధన్ ముదిరాజ్, నాగరాజ్ గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జైత్రయాత్ర

మొదటి పేజీ తరువాయి...

కలిసి ఏర్పాట్లను సమీక్షించి అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగిత్యాల మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయిందని, ప్రజల్లో ఉత్సాహం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. జగిత్యాల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్రకు శ్రీకారం చుడతామని, ఇదే వేదిక నుంచి పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడానికి సంకల్పం వ్యక్తం చేశారు. కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో ప్రజల ఆశీర్వాదాన్ని పొందేందుకు ఈ సభ కీలకమని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక కొత్త దశ ప్రారంభమవుతోందని, రాజకీయ పునరేకీకరణ జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పలు ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించిన కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలను తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ సభకు ప్రజల దృష్టి వెళ్లకుండా చేయడానికి సమాంతర కార్యక్రమాలు ప్లాన్ చేస్తున్నారని, మీడియా దృష్టిని మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, సభకు వచ్చే ప్రజలను అడ్డుకునే ఉద్దేశంతో రహదారులను తవ్వడం వంటి చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, చిన్నచూపు రాజకీయాలుగా అభివర్ణించిన కేటీఆర్, ఎంతటి అడ్డంకులు వచ్చినా సభ విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. గతంలో కూడా జగిత్యాలలో కేసీఆర్ నిర్వహించిన సభలు చారిత్రాత్మకంగా నిలిచాయని, ఈ సభ కూడా అదే స్థాయిలో విజయవంతం అవుతుందని అన్నారు. సభకు లక్షలాది మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున, అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మూడు లక్షల మంచినీటి బాటిల్స్, రెండు లక్షల మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం వేళలోనే సభ ప్రారంభమయ్యేలా ప్రణాళికలు రూపొందించామని, ప్రజలు సౌకర్యంగా పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పార్టీ నాయకత్వం మొత్తం సమిష్టిగా పనిచేస్తోందని, ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించామని తెలిపారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్ రావు, కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్ రెడ్డి, బాల్క సుమన్ తదితర నాయకులు వివిధ ప్రాంతాల్లో సమన్వయం చేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని వివరించారు. జగిత్యాలను కేంద్రంగా తీసుకుని మొత్తం జిల్లా స్థాయిలో సమగ్ర ప్రణాళికతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరిక పార్టీకి మరింత బలం చేకూర్చిందని, ఆయన చేరికతో ప్రజల్లో కొత్త ఉత్సాహం నెలకొన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో సభకు హాజరవుతారని, కేసీఆర్ ఏమి మాట్లాడతారో అన్న ఆసక్తి ప్రజల్లో కనిపిస్తోందన్నారు. కార్యకర్తలు, ప్రజలు శాంతియుతంగా, సంయమనంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. జగిత్యాల ప్రజలు ఈ సభకు ఆతిథ్యమిస్తున్నారని, అందరూ కలిసికట్టుగా సహకరించాలని కోరారు. అవసరమైతే కార్యకర్తలు ముందుకు వచ్చి బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల జరిగిన చిన్నపాటి అవాంఛనీయ ఘటనలపై పాత్రికేయులకు క్షమాపణలు తెలియజేసిన కేటీఆర్, గాయపడిన వారికి పూర్తి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం మీద ఈ సభను చారిత్రాత్మకంగా నిలబెట్టేందుకు పార్టీ శ్రేణులు అహర్నిశలు కృషి చేస్తున్నాయని స్పష్టం చేశారు.

# కవిత అల్టిమేటం

మొదటి పేజీ తరువాయి...

ఇతర పోలీస్ స్టేషన్లలో ఉన్న వారిని కూడా విడుదల చేయాలని కవిత డిమాండ్ చేశారు. చివరికి పోలీసులు ఉద్యమకారులను విడుదల చేయడంతో, వారిని వెంట తీసుకుని కవిత పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తెలంగాణ వచ్చిన తర్వాత కూడా ఉద్యమకారులను జైలుకు పంపడం దురదృష్టకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన భూమి, పెన్షన్ వంటి హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. హామీలు నెరవేర్చకపోతే కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో తిరగడానికి కూడా పరిస్థితి ఉండదని హెచ్చరించారు. తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు తగిన గౌరవం దక్కలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఇప్పటికీ హామీలపై స్పష్టత లేకపోవడం నిరాశ కలిగిస్తోందన్నారు. అసెంబ్లీలో ఉద్యమకారుల బిల్లును ప్రవేశపెడతామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. ఉద్యమకారులకు హామీ ఇచ్చిన భూమి వెంటనే ఇవ్వాలని, లేకపోతే జాగృతి ఆధ్వర్యంలో భూపోరాటాలు చేపట్టి భూములను ఆక్రమించుకుంటామని కవిత హెచ్చరించారు. ఇప్పటికే ఈ దిశగా చర్యలు ప్రారంభించామని, భవిష్యత్తులో కూడా ఉద్యమకారులతో కలిసి పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

ఉద్యమకారులందరూ ధైర్యంగా ఉండాలని, మనం పోరాడి తెలంగాణ సాధించినట్టే హక్కులను కూడా సాధించుకోవడం కష్టమేమీ కాదని కవిత పిలుపునిచ్చారు.

# తమిళనాడులో తిరిగి డిఎంకె కూటమిదే అధికారం

## లౌకికవాదం కోసం తమిళ ప్రజలు ముందుంటారు - తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

రాణిపేట జిల్లా : ముఖ్యమంత్రి,డీఎంకే అధినేత స్టాలిన్ నాయకత్వంలోని కూటమి తమిళనా డులో తిరిగి మంచి మెజారిటీతో అధికారం లోకి రాబోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన తమిళనాడు రాష్ట్రంలోని రాణిపేట జిల్లా షోలింగేర్ సర్కిల్ సమీపంలోని పండియా నల్లూర్ లో ఏర్పాటుచేసిన రాహుల్ గాంధీ సభలో పాల్గొన్నారు. సభ ఏర్పాట్ల ముందు శనివారం ఉదయం రాణి పేట జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ప్రసంగించా రు. లౌకిక వాదాన్ని బలోపేతం చేయడంలో సంరక్షించడంలో తమిళనాడు ప్రజలు ముం దుంటారని తెలిపారు. వీరగడ్డకు, ఆత్మగౌరవా నికి తమిళనాడు మారుపేరు అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని తపించే ఒక సామాన్య కార్యకర్తగా మీ అందరి ముందుకు వచ్చానని డిప్యూటీ సీఎం తెలిపారు. తమిళనాడు అంటే కేవలం ఒక రాష్ట్రం కాదు అదొక సిద్ధాంతం. ప్రస్తుతం ఢిల్లీ పీఠంపై కూర్చున్న పెద్దలు తమిళనాడు సంస్కృతిని, భాషను, హక్కులను కాలరాయాలని చూస్తున్నారని వారిని ఎదుర్కోవాలి అంటే సెక్యులర్ శక్తుల ఐక్యత అవసరం అన్నారు. సీఎం. ఏంకే స్టాలిన్ నాయకత్వంలో తమిళనాడు అభివృద్ధి పథంలోకి దూసుకుపోతుంది, రాహుల్ గాంధీ ప్రేమ సందేశం స్టాలిన్ అభివృద్ధి నినాదం ఒకటి అయ్యాయి, డీఎంకే కూటమి గెలుపు కేవలం తమిళనాడుకే కాదు దేశానికి దిక్సూచిగా మారబోతుంది అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 కే గ్యాస్ సిలిండర్, రెండు లక్షల వరకు ఒకేసారి రైతులకు రుణమాఫీ, తెల్ల రేషన్ కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి సన్నబియ్యం, 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం వంటి హామీలను అమలు చేసి చూపించామని వివరించారు.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ డిఎంకె కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి, తమిళ ప్రజలు వేసే ఓటు కేవలం ఒక గుర్తుపై వేసే ముద్ర కాదు అది విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా వేసే ఓటు అది నియంతృత్వానికి వ్యతిరేకంగా వినిపించే ప్రజాస్వామ్య గొంతుక అన్నారు.



## ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

**- తహసీల్దార్ కు వినతి పత్రం అందజేసిన ప్రభుత్వ ఉద్యోగులు**



రుద్రంగి, ఏప్రిల్ 18 (ప్రజాకలం ప్రతినిధి)



తెలంగాణ ఎంప్లాయిస్, టీచర్స్, పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల ప్రభుత్వ ఉద్యోగులు తమ డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులకు సంబందించి దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను న్యాయ బద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. జూన్ 2వ తేదీ నాటికీ పీఆర్సీ అమలు పరచాలని అలాగే హెల్త్ స్కిమ్ లు ఓపిఎస్ విధానం అమలు పరచాలని కోరారు. పెండింగ్ బిల్లులతో పాటు పెండింగ్ డీఏలను అమలు చేయాలని, 61సంవత్సరాలు నిండిన విఆర్ఎ ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కలిపించాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.

## ప్రాథమిక పాఠశాల లో వార్షికోత్సవం సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం




ఎండపల్లి, వెల్గటూర్ ఏప్రిల్ 18 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండలం జగదేవ్ పేట గ్రామ పంచాయతీ పరిధిలో అంబేద్కర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజ ఆధ్వర్యం లో ప్రాథమిక పాఠశాల లో వార్షికోత్సవం సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులు స్టేజి పైన సాంస్కృతిక కార్య క్రమాలు, విన్యాసాలు అందరినీ అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ నల్ల తిరుపతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ హాఫీజ, సి అర్ పి వైద్యు వెంకటేష్, ఉ ప సర్పంచ్ కొర్రి గంగయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బచ్చల స్వామి, మాల సంఘం అధ్యక్షులు దేవదాస్, జగదేవ్ పేట గ్రామ వార్డు సభ్యులు, నాయకులు పారువెల్లి జీవన్ రావు, యువకులు, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కోనరావుపేటలో దొంగతనం


మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజా కలం) కొనరావుపేట గ్రామానికి చెందిన కొడిదల రాము ఇంటిలో రాత్రి ఇంట్లో దొంగలు పడ్డారు. విలువైన వస్తువులు, బంగారు నగలు ఎత్తుకెళ్లారు. కొడిదల రాము బతుకు దెరువు కోసం దుబాయ్ వెళ్లారు. భార్య తల్లిగారింటికి వెళ్ళింది. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని దొంగలు దోపిడికి పాల్పడినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దొంగ తనం జరిగిన తీరును పరిశీలి ంచారు. కుటుంబ సభ్యుల ద్వారా ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు వెల్లడించారు.

## హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రేణుక యారా ను కలిసిన న్యాయవాదులు

ఎండపల్లి, ధర్మపురి ఏప్రిల్ 18 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి బార్ అసోసియేషన్ న్యాయవాదుల ఆధ్వర్యం లో శనివారం రోజున కోరుట్ల లో అడిషనల్ జ్యూడీ షియల్ మేజిస్ట్రేట్ కోర్ట్ ప్రారంభో త్సవ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రేణుక యారా ను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్చం ఇచ్చి ఫోటో అందజేశారు. ఈ సందర్భంగా ధర్మపురి జూనియర్ సివిల్ కోర్టు శాశ్వత భవనం ఏర్పాటు చేయు టకు కృషి చేయాలని వినతి పత్రం ఇస్తూ విన్నవించారు. ఈ కార్య క్రమం లో ధర్మపురి బార్ ఆసోసి యేషన్ అధ్యక్షులు బందెల రమేష్, ఉపాధ్యక్షులు మామిడాల శ్రీకాంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి రామడుగు రాజేష్, ఎక్స్ అఫిసియో మెంబర్ అలుక వినోద్ కుమార్, ట్రెస్సరర్ గూడ జితేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఓరగంటి చంద్రశేఖర్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ కస్తూరి శరత్ కుమార్, సీనియర్ ఈసి మెంబర్ రౌతు రాజేష్, ఐ ఎల్ పి ఏ జిల్లా కార్యదర్శి జాజల రమేష్, న్యాయవాదులు బత్తిని ఇంద్రకరణ్ పాల్గొన్నట్లు ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బందెల రమేష్ తెలిపారు.




### బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ ప్రజలకు

# బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి**

రుద్రంగి, ఏప్రిల్ 18, (ప్రజాకలం ప్రతినిధి)

తెలంగాణను దేశ విభజనతో పోల్చడం అజ్ఞానానికి పరాకాష్ట రాజన్న సిరిసిల్ల జిల్లా ఉమ్మడి చందుర్తి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి మండిపడ్డారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్ - పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ లోక్‌సభలో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ అమరవీరులను, కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలను అవమానించడమేనని, వందలాది మంది ప్రాణ త్యాగాలతో సిద్ధించిన తెలంగాణను దేశ విభజనతో పోల్చడం తేజస్వీ సూర్య అహంకారానికి నిదర్శనమని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ సమాజంపై విషం చిమ్మిన ఆయనను వెంటనే ఎంపీ పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడినందుకు ఎంపీ బేషరతుగా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆయన చేసిన వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుండి తొలగించాలని కోరారు. ఢిల్లీలో తెలంగాణ తల్లికి అవమానం జరుగుతుంటే ఇక్కడి బీజేపీ నాయకులు నోరు మెదపకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తే సహించేది లేదని, ఇలాంటి విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



### మల్లాపూర్ గురుకుల బాలికల పాఠశాల వద్ద

## ఆర్టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్ బోర్డు ఏర్పాటు

ఎండపల్లి, ధర్మారం ఏప్రిల్ 18 : ( ప్రజా కలం ప్రతినిధి )

ధర్మపురి నియోజకవర్గం ధర్మారం మండలం లోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాల వద్ద గత కొన్ని నెలలుగా ఆర్టీసీ బస్సులు ఆపకపోవడం వల్ల టీచర్లు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు అనారోగ్యం పాలైతే హాస్పిటల్ వెహికల్స్ ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుందని, దీనిని దృష్టిలో పెట్టు కుని మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసి డెంట్ సుంచు మల్లేశం ఇటీవల కరీంనగర్ ఆర్టీసీ డిపో వన్ మేనేజర్ ను కలిసి దరఖాస్తు ఇవ్వగా అక్కడ రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని డిపో మేనే జర్ సూచించారు. డిపో మేనేజర్ సూచనల మేరకు మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ తెలంగాణ గురుకు లాల పేరెంట్స్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు సుంచు మల్లేశం తన సొంత ఖర్చులతో ఆర్టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్ బోర్డును శనివారం రోజున పాఠశాల గేటు బయట ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాల వద్ద ఆర్టీసీ బస్సులు ఆపకపోవ డం దారుణమని. ఉపాధ్యాయులు పత్తిపాక ఎక్స్ రోడ్ వద్ద దిగి అక్కడే ఎక్కాల్సిన పరిస్థితి వస్తుందని నైట్ షిఫ్ట్ అనంతరం ఉపాధ్యాయులు పాఠశాల నుండి నడిచి వెళ్లడం వల్ల వారికి భద్రతా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు సంబంధిత మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని మల్లాపూర్ గురుకుల పాఠశాల వద్ద ఆర్టిసి బస్సులను నిలిపేందుకు చర్యలు తీసుకోవా లని కోరారు.




ఈ కార్యక్రమం లో ప్రిన్సిపల్ అరుణ. వైస్ ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి, మాజీ పేరెంట్స్ కమిటీ నాయకులు వడ్కాపురం రవి, కాంపల్లి తిరుపతి, మెట్పల్లి నరేష్, జుంజి పెల్లి నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డికి ప్రశంస పత్రాన్ని అందించిన మంత్రి

**- జిల్లా కలెక్టర్ ఎం సత్య ప్రసాద్, జిల్లా విద్యాధికారి కిలావత్ రాము నాయక్ ఆధ్వర్యంలో**

**- ప్రభుత్వ పాఠశాలను దాతల సహకారంతో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసిన హెచ్ఎం**



ధర్మపురి ఏప్రిల్ 18 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుండ్లకోట గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందూరు రాజిరెడ్డి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధి నిర్వహణలో అంకితభావం తో పాఠశాలను దాతల సహకారం తో అన్ని రంగాల లో అభివృద్ధి పరచడం, విద్యార్థులకు క్రమ శిక్షణ తో కూడిన నాణ్యమైన విద్యా బోధన అందించడం, అందమైన రంగు రంగుల యూనిఫామ్ తో కార్పొరేట్ పాఠశాల ను మించి తీర్చిదిద్దడం, ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం లో పెద్ద ఎత్తున విద్యార్థులను పాఠశాలలో నమోదు చేయడం, ఆదర్శ వంతమైన పనితీరు తో రాష్ట్రం లోనే ఉత్తమ ప్రాథమిక పాఠశాల గుల్లకోటను తీర్చి దిద్ది నందుకు గాను రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ప్రశంసలు సన్మానం పొందిన సందర్భాన్ని పురస్క రించుకొని శనివారం రోజున ప్రాథమిక పాఠశాల గుల్లకోట ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డిని జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం లో జరిగిన ధర్మపురి నియోజకవర్గ స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశం లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల జిల్లా కలెక్టర్ ఎం సత్య ప్రసాద్ జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్, ప్రశంసించి అభినందించడం జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ అధికారి కిలా వత్ రాము నాయక్, ఎండపల్లి మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అభినందనలు తెలిపారు.

## మెట్ పల్లి డిగ్రీ కళాశాలలో మెరుగైన సౌకర్యాలు - ప్రిన్సిపాల్ వెంకయ్య



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజా కలం) పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంచి నీరు, విద్యుచ్ఛక్తి, విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం, అర్హత గల విద్యార్థులకు ఉపకార వేతనాల మంజూరు, అనుభవ జ్ఞులైన ఉపన్యాసకులు వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయని, అందువల్ల మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెంటనే చేరాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ వెంకయ్య విద్యార్థులకు సూచించారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని రాఘవపేట, సిర్ పూర్ గ్రామాలలో "దోస్త్" అడ్మిషన్ల కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్, వొకేషనల్, ఓపెన్ ఇంటర్ లలో ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రావాలని, వారికి ఆన్లైన్ లో కళాశాలలోనే రిజిస్ట్రేషన్ లు చేస్తామని విద్యార్థులకు సూచించారు. మొదటి దశలో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు 200 రూపాయల ఛార్జీని వసూలు చేస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, అందువల్ల విద్యార్థులు అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్ లు చేసుకోవాలని మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కోరారు. అనంతరం రాఘవపేట సర్పంచ్ తోట శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఉ త్తీర్ణులైన విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చేర్పిస్తామన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలలోనే విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయని, అందువల్ల విద్యార్థులను ప్రభుత్వ విద్యా సంస్థలలో చేర్పిస్తామని సర్పంచ్ శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. ఈ అడ్మిషన్ ల ప్రచార కార్యక్రమంలో కళాశాల ఉపన్యాస కులు అంజయ్య, సత్యశోధన్ లతో పాటు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి మోహన్ నాయక్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, పూర్వ విద్యార్థులు విజయ్, నరేందర్, శేఖర్, రమేశ్ గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాద పలు బాధిత కుటుంబాలకు పరిహార చెక్కుల పంపిణీ

**- అధికారులతో కలిసి పరిహారం చెక్కులను అందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



ఎండపల్లి, ధర్మపురి ఏప్రిల్ 18 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నం గ్రామం విద్యుత్ ప్రమాదం లో మరణించిన బాధిత కుటుంబానికి రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చెక్కులను అందజేశారు. ధర్మపురి మండలం రాయపట్నం గ్రామానికి చెందిన గటిక చిన్నయ్య మూడు సంవత్సరాల క్రితం విద్యుత్ షాక్ తో మరణించడం తో చిన్నయ్య భార్య గటిక అమ్మాయికి 5 లక్షల రూపాయల చెక్కు పరిహారాన్ని రాయపట్నం గ్రామ పంచాయతీ వద్ద జరిగిన కార్యక్రమం లో శనివారం రోజున మంత్రి లక్ష్మణ్ కుమార్ చెక్కులను అందజేశారు. వెల్గటూర్ మండ లం కోటిలింగాల గ్రామానికి చెందిన రాపాక మహేందర్ గేదె విద్యుత్ షాక్ తో మరణించడం తో ప్రభుత్వం తరఫున 40 వేల రూపాయల పరిహారాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ చెక్కును రాపాక మహేందర్ కు అందజేశారు ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్, జగిత్యాల జిల్లా ట్రాన్స్ కో ఎస్ సి సుదర్శనం, డిఈ గంగారం, గ్రామ సర్పంచ్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు జడ్జిని కలిసిన ఎస్పీ



జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజా కలం) కోరుట్ల పట్టణానికి మంజూరు చేసిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును ప్రారంభించేందుకు కోరుట్లకు విచ్చేసిన హైకోర్టు జడ్జి రేణుక యార ను శనివారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి అశోక్ కుమార్ జడ్జికి పూల బొకే ను అందజేశారు.

## ఏఐ సాంకేతికతతోనే ప్రభుత్వ పాలనలో వేగం

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి,ఏప్రిల్ 18:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ఏఐ సాంకేతికత వినియోగం ద్వారా ప్రభుత్వ పనితీరులో వేగం,సామర్థ్యం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.ప్రతి అధికారి,సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించి తమ పనిని మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.శనివారం జిల్లాలో నిర్వహించిన ఏఐ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం ద్వారా పనుల్లో వేగం పెరగడంతో పాటు సమయాన్ని ఆదా చేయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను నేర్చుకుని,తమ దైనందిన విధుల్లో అమలు చేయాలని సూచించారు.శిక్షణ కార్యక్రమాలను కేవలం హాజరు పరిమితంగా కాకుండా,అందులో నేర్చుకున్న విషయాలను పనిలో ప్రతిఫలింపజేయాలని అన్నారు.ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా,సమర్థవంతంగా అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజలకు త్వరితగతిన,నాణ్యమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.శిక్షణ కార్యక్రమాలకు సమయపాలనతో హాజరై,పూర్తి స్థాయిలో పాల్గొనాలని,నేర్చుకునే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్,సంబంధిత అధికారులు,అన్నీ శాఖల సిబ్బంది,తదితరులు,పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

**- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణ రావు**

పెద్దపల్లి,ఏప్రిల్ 18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ఈనెల 20న మంథని నియోజకవర్గంలోని కాటారం మండల కేంద్రంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బహిరంగ సభను భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పిలుపునిచ్చారు. శనివారం పెద్దపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పెద్దపల్లి మండలం,పట్టణ కౌన్సిలర్లు,వివిధ గ్రామాల సర్పంచ్‌లు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని,ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య,స్థానిక కౌన్సిలర్లు,గ్రామ సర్పంచ్‌లు,కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల నాయకులు,కార్యకర్తలు,యువజన విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రజా కలం

ఆదివారం, ఏప్రిల్ 19, 2026

# కార్పొరేట్ ప్రపంచంలో భద్రతా లోపాలు..

ప్రస్తుతం ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరుగుతున్నాయి.. ఐపీఎల్ సీజన్ జరుగుతోంది.. గల్ఫ్ శాంతి చర్చలు చర్చనీయాంశంగా మారాయి. నాసిక్‌లోని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)లో సహోద్యోగులు తమను బెదిరించి, లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఎనిమిది మంది మహిళలు ఆరోపించారు. నిందితులపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదుచేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 9 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. నిందితుల్లో టీసీఎస్‌లో పనిచేసే హెచ్ఆర్ ఉద్యోగులు, డెలివరీ పార్ట్‌నర్లు, ఇతర ఉద్యోగులు ఉన్నారు. బలవంతం చేయడం, లైంగిక వేధింపులు, పెళ్లి పేరుతో మోసం చేయడం, మతపరమైన మనోభావాలను దెబ్బతీయడం వంటి అనేక ఆరోపణలను బాధితులు చేశారు. ఈ కేసులో ఒక మహిళతో సహా మొత్తం ఏడుగురిని అరెస్టు చేశారు, మరో నిందితురాలు పరారీలో ఉన్నారు. అరెస్టు అయిన ఉద్యోగులను కంపెనీ సస్పెండ్ చేసింది. తనిఖీల్లో సహకరిస్తున్నామని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కేసులో నమోదైన మొదటి ఎఫ్ఐఆర్‌లో బాధితురాలు తీవ్ర ఆరోపణలు చేశారు. బాధితురాలికి 2022లో నిందితుడితో పరిచయం ఏర్పడింది. నిందితుడు ఆమె స్నేహితుడే. ఇద్దరూ ఒకే కాలేజీలో చదువుకున్నారు, తరచుగా కలుస్తుండేవారు. తాను పనిచేస్తున్న కంపెనీలోనే ఆమెకు ఉద్యోగం ఇప్పిస్తానని నిందితుడు హామీ ఇచ్చారు2022 జులైలో శారీరక సంబంధం కోరుతూ ఆ మహిళపై నిందితుడు ఒత్తిడి తెచ్చారు. అభ్యంతరం తెలపడంతో పెళ్లి ప్రతిపాదన తెచ్చారు. ఆలోచించి తన నిర్ణయం చెబుతానని ఆమె బదులిచ్చారు. అయితే, కాలేజీ అయిపోయిన తర్వాత తరచూ ఆమెను కలవడానికి పిలిచేవారు. డిగ్రీ పూర్తయిన తర్వాత తను పనిచేసే టీసీఎస్ కంపెనీలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని నిందితుడు సూచించారు. ఆపై ఆమె కంపెనీలో అసోసియేట్ పోస్టుకు ఎంపికయ్యారు. ఒకే కంపెనీ కావడంతో అక్కడ కూడా వారు తరచుగా కలుస్తూ ఉండేవారు. ఈ కంపెనీలోనే నిందితుడికి పరిచయమున్న ఒక పురుష, ఒక మహిళా ఉద్యోగితో బాధితురాలికి పరిచయం ఏర్పడింది. వీరు నలుగురు తరచూ కలిసి ఉండేవారు. క్యాంటీన్‌కు లేదా బయట తిరగడానికి కలిసి వెళ్లేవారు. ఈ సమయంలో నిందితుడు, మిగిలిన ఇద్దరు కలిసి బాధితురాలితో 'నీ మతం చెడ్డది, మా మతం మంచిది' అని చెబుతుండేవారు. ఆమె మతం గురించి చెడుగా మాట్లాడేవారు. 2024 ఆగస్టులో నిందితుడు ఈ బాధితురాలిని ఒక రిసార్ట్‌కు తీసుకువెళ్లి అక్కడ బలవంతంగా శారీరక సంబంధం పెట్టుకున్నారు. ఆ తర్వాత వారిద్దరి సంబంధం గురించి కుటుంబ సభ్యులకు చెబుతానని బెదిరిస్తూ ఆయన కంపెనీ స్నేహితుడు కూడా బాధితురాలిని నుంచి శారీరక సంబంధం కోరారు. ఇద్దరు పురుష స్నేహితులు కలిసి, బాధితురాలి మతం చెడ్డదని, వారి మతాన్ని స్వీకరించాలని చెబుతుండేవారు. దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడానికి ప్రయత్నించేవారు. ఈ క్రమంలోనే ఆమెతో సాన్నిహిత్యం పెంచుకోవడానికి కూడా ప్రయత్నిస్తుండేవారు. తర్వాత 2026 ఫిబ్రవరిలో ఒక మహిళ నుంచి బాధితురాలికి ఫోన్ వచ్చింది. ఆ మహిళ నిందితుడి భార్య అని, వారికి ఇద్దరు పిల్లలున్నారని తెలిసింది. దీంతో, "మొదటి భార్య ఉండగా నన్ను ఎందుకు మోసం చేశావు?" అని నిందితుడిని బాధితురాలు ప్రశ్నించారు. దానికి నిందితుడు పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. "నీతో పెళ్లికి నాకెప్పుడూ ఆసక్తి లేదు" అన్నారాయన. ఇలా నిందితుడు, ఆయన స్నేహితుడు, మరో మహిళా ఉద్యోగి కలిసి బాధితురాలి మతపరమైన మనోభావాలను కూడా దెబ్బతీశారు. నిందితుడు మొదటి పెళ్లిని దాచిపెట్టి, అబద్ధం చెప్పి, పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చి బాధితురాలితో శారీరక సంబంధం పెట్టుకున్నారు. పదేపదే లైంగిక వేధింపులకు గురిచేశారు. డెలివరీ పార్ట్‌నర్‌గా ఉన్న నిందితురాలిపై వచ్చిన ఆరోపణలను ఆమె తరపు న్యాయవాదులు తోసిపుచ్చారు. వారు స్పందించగానే ఈ కథనాన్ని అప్‌డేట్ చేస్తాం. ఇదే సమయంలో ప్రముఖ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నాసిక్ కార్యాలయంలో 2020 నుంచి సాగుతున్న లైంగిక వేధింపులు, బలవంతపు మతమార్పిడి యత్నాలు బయటపడ్డాయి. ఇవి ఇప్పుడు ఐటీ ఉద్యోగాలు చేసే యువతుల తల్లిదండ్రుల్లో గుబులు రేపుతున్నాయి. ఉద్యోగ అవకాశం చూపి యువతులను లొంగదీసుకోవడం, మతపరమైన వేధింపులకు గురిచేయడం, సామూహిక అత్యాచారాలు జరగడం వంటి ఘోరాలు వెలుగుచూశాయి. ముంబై పోలీసులు 40 రోజుల పాటు రహస్య ఆపరేషన్ నిర్వహించి ఈ ఘోరాన్ని బయటపెట్టారు. ఏడెనిమిది మంది మహిళా పోలీసులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా టీసీఎస్‌లో చేర్పించి, హెచ్ఆర్ విభాగంలో పనిచేసే మహిళా ఉద్యోగిని ట్రాప్ చేశారు. వాట్సాప్ గ్రూపులు, మతపరమైన సందేశాలు, బాధితుల వాంగ్మూలాలు ఆధారంగా ఆరుగురు పురుష ఉద్యోగులు, ఒక మహిళా హెచ్ఆర్ అధికారిని అరెస్టు చేశారు. నిందితుల్లో ఆసిఫ్ అన్సారీ, షఫీ షేక్, దానిష్, షారుఖ్ ఖురేషీ, రెజా రహ్మాన్, తౌసీఫ్ అత్తర్ ఉన్నారు. వీరు కలిసి ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ నడుపుతూ, హిందూ యువతులను లక్ష్యంగా చేసుకున్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి, పెళ్లి చేసుకుంటామని మాటిచ్చి, లైంగికంగా వేధించారు. హిందూ దేవుళ్లపై అసభ్యకరంగా మాట్లాడడం, రంజాన్‌లో రోజా పాటించమని బలవంతం చేయడం, బీఫ్ తినిపించడం వంటి ఘోరాలు జరిగాయి. ఒక హిందూ యువతి ఇంజినీరింగ్ పూర్తి చేసి టీసీఎస్‌లో చేరింది. సీనియర్ ఉద్యోగి ఆమెపై లైంగిక దాడులకు పాల్పడ్డాడు. తర్వాత ఆమెకు మెహరీన్ అనే మహిళ ఫోన్ చేసి, ఆ ఉద్యోగి వివాహితుడని, తాను అతని భార్యనని తెలిపింది. దీంతో బాధితురాలు అతడిని నిలదీయగా, వేధింపులు మొదలయ్యాయి. కంపెనీలోని ఇంటర్నల్ కంప్లైంట్ సిస్టమ్‌లో ఫిర్యాదు చేసినా, ముస్లిం అధికారి 'ఇవన్నీ కామన్' అని తోసిపుచ్చారు. చివరకు పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘోరం బయటపడింది. పోలీసులు ఆపరేషన్ చేయకపోయి ఉంటే, ఆ యువతి ఆక్రందన అరణ్యరోదనగా మిగిలేది. మొత్తం 9 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. నిందితుల అరెస్టు తర్వాత మూడు రోజులకు టీసీఎస్ ఒక ప్రకటన విడుదల చేసింది. అరెస్టయిన ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు తెలిపింది. కానీ వారి నేరాల గురించి, బాధితులకు జరిగిన అన్యాయం గురించి ఎలాంటి ప్రస్తావన చేయలేదు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామనే హామీ కూడా ఇవ్వలేదు. ఈ ఘటన కార్పొరేట్ ప్రపంచంలోని లోటుపాట్లను బయటపెట్టింది. బాధితురాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం ఇందుకు నిదర్శనం. హిందువులను లక్ష్యంగా చేసుకుని చేసిన వేధింపులు మతపరమైన వివక్షకు నిదర్శనం. మతపరమైన ప్రమేయం ఉన్న ఉద్యోగులు కీలక పదవుల్లో ఉంటూ ఇలాంటి చర్యలకు పాల్పడడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఏటా లక్షల మంది ఇంజినీరింగ్ పూర్తి చేసి, లక్షల వేతనం ఆశతో ఐటీ కంపెనీల్లో చేరుతున్నారు. కానీ టీసీఎస్ ఘటన తల్లిదండ్రుల్లో భయాందోళనలు రేకెత్తిస్తోంది. ఉద్యోగం పేరుతో పిల్లలు నరకం చూస్తుంటే, వారిని ఎలా కాపాడాలనే ప్రశ్న ఉత్పన్నమైంది. ఇలాంటి నేరాల్లో పాల్పడినవారిపై కఠిన చట్టాలు అమలు చేయాలి. కంపెనీల ఇంటర్నల్ కంప్లైంట్ సిస్టమ్‌లకు బయట స్వతంత్ర పర్యవేక్షణ అవసరం. ఉద్యోగ ప్రాంతాల్లో మతపరమైన ప్రస్తావనలు, ప్రచారాలు పూర్తిగా నిషేధించాలి. కంపెనీలు ఉద్యోగుల భద్రతకు బాధ్యత తీసుకోవాలి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఐటీ, కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. ఉద్యోగం కోసం నగరాలకు వలస వచ్చిన యువతకు కార్పొరేట్ కంపెనీలు సురక్షిత ప్రాంతాలుగా ఉండాలి.

# ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలి

## వేసవి కాలం లో కూలీలకు రక్షణ చర్యలు

## పనుల నాణ్యత లో రాజీ లేదు - జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్



మల్లాపూర్ ఏప్రిల్ 18 ( ప్రజా కలం ప్రతినిధి)

అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశం కల్పించాలి అని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. ఈ మల్లాపూర్ మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంపుపై ప్రత్యేకంగా చర్చించారు. గ్రామాల్లో మరిన్ని కూలీలను పనుల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పనుల అందుబాటును పెంచాలని ఆదేశించారు. పనుల ఎంపికలో పారదర్శకత పాటించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. పనుల ప్రగతిని రోజువారీగా పర్యవేక్షించాలని, కూలీల హాజరు నమోదు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. మస్టర్ రోల్స్‌లో ఎటువంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. కూలీలకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఉపాధి హామీ పనుల్లో మహిళలను అధికంగా భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ప్రతి పనిని ఫోటో క్యాప్చరింగ్ ద్వారా యన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేసి, జియో ట్యాగింగ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. నిర్ణీత లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని, పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రజల జీవనోపాధి మెరుగుపరచడంలో కీలకమని అన్నారు. పనుల ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసి, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు తగిన సదుపాయాలు కల్పించాలని సూచించారు. షేడ్ నెట్‌లు, తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స వంటి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మెట్‌పెల్లి ఆర్డీఓ నరసింహారావు, డీఆర్‌డీఓ రఘువరన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జగదీశ్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివి

# ఉన్నత లక్ష్యాలను సాధించాలి

## - రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



గోదావరిఖని,ఏప్రిల్ 18:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని,క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ సూచించారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు కో-ఎడ్యుకేషన్ విద్యాసంస్థల 2025-2026 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను,పాఠశాల సిబ్బందిని ఆయన ఘనంగా అభినందించి, సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలు అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతున్నాయని,విద్యా రంగంలో నాణ్యత పెంపుతో పాటు విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పౌష్టికాహార బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తున్నామని,ఇందులో భాగంగా వారంలో మూడు రోజులు పాలు,మరో మూడు రోజులు రాగి జావ అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## వేసవి పూట ఆరు బయట నిద్రిస్తున్నారా..

# జర జాగ్రత్త..!!

## అప్రమత్తతే నేరాల నియంత్రణకు అడ్డుకట్ట : మెట్ పల్లి ఎస్సై పబ్బ కిరణ్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజా కలం) వేసవి పూట ఆరు బయట నిద్రిస్తున్నారా జర జాగ్రత్తగా..!! ఉంటూ ఆస్తులను కాపాడుకోవాలని మెట్ పల్లి ఎస్సై పబ్బా కిరణ్ సూచించారు. వేసవికాలంలో చాలామంది ఆరు బయట నిద్రించేందుకు ఉపక్రమిస్తారని అయితే ఇది నేరస్థులు ఆస్తులను దోచుకుపోయేందుకు మంచి అవి అవకాశంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఆరు బయట నిద్రించే ముఖ్యంగా మహిళలు తమ మెడలో నగలను వేసుకొని నిద్రిస్తుంటారని మరి కొంతమంది యింటికి తాళం వేసి దాబాపై నిద్రిస్తుంటారని ఇది రోజు గమనించే దొంగలు ఇళ్ళకు కన్నం వేస్తుంటారని తెలిపారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో ఆరు బయట దాబా పైన నిద్రించాలని భావిస్తే విలువైన నగలను నగదును జాగ్రత్తగా భద్రపరచుకొని గమనించుకోవాలని ఎస్ఐ కిరణ్ సూచించారు.

**నేరాల నియంత్రణ చర్యలు...**

ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ఇంట్లో సీసీ కెమెరా అమర్చుకోవటం మంచిదన్నారు. ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకి, డయాల్ 100 కి సమాచారం అందించాలన్నారు. సెలవులను పురస్కరించుకొని సొంత ప్రాంతాలకు, బంధువుల ఇండ్లకి, విహార యాత్రలకు వెళ్లే ఆయా గ్రామాల, కాలనీ, ఆపార్టుమెంట్ వాసులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కూడా మెట్ పల్లి ఎస్సై పబ్బ కిరణ్ తెలిపారు. చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఊరికి వెళ్లాల్సివస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని, లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలన్నారు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదని, తమతో పాటే తీసుకెళ్లాలన్నారు. తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్టేషన్ లో సమాచారం ఇవ్వాలని,వారి వివరాలు నమోదు చేసుకొని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోండి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్ తో లాక్ వెయ్యడం మంచిదన్నారు.




నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్ మెన్, సెక్యూరిటీ సిబ్బంది ఏమి చేస్తోంది. అందుబాటులో ఉండే మొబైల్ లో ఇంటిని, పరిసరాలను లైవ్, ప్రత్యేక్షంగా చూసుకొవచ్చు. సెక్యూరిటీ సర్వేలైన్స్ కు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని ఏర్పాటు చేసుకోవాలని ఆయన అన్నారు. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలని, ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలన్నారు. ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చుమని చెప్పాలని, ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్స్, పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలని, వాటిని కూడా గమనించి నేరస్థులు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉన్నదని ఎస్సై పబ్బ కిరణ్ సూచించారు. మీ గ్రామం, పట్టణం, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్ కు తప్పనిసరిగా సమాచారం ఇవ్వండి. డయల్ 100కు కాల్ చేయాలని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖ వారి సూచనలు పాటిస్తూ సహకరిస్తే చోరీల నియంత్రించడం సులభం అవుతుందని మెట్ పల్లి ఎస్సై పబ్బ కిరణ్ తెలిపారు.

# హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోం

## - బీజేపీ యువమోర్చా నాయకుడు ఎర్రోళ్ల శ్రీకాంత్

## - సినీ నటుడు ప్రకాష్ రాజ్ పై కేసు పెట్టిన బీజేపీ శ్రేణులు




పెద్దపల్లి,ఏప్రిల్ 18:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్న సినీ నటుడు ప్రకాష్ రాజ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో బీజేపీ యువమోర్చా నాయకులు ఎర్రోళ్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఇటీవల కేరళలో జరిగిన మీడియా సమావేశంలో ప్రకాష్ రాజ్ రామాయణాన్ని అవమానిస్తూ శ్రీరాముడు,సీతమ్మ, లక్ష్మణులను వలస కూలీలుగా పేర్కొనడం, వారు పండ్లను దొంగతనం చేయడం వల్లే రామ-రావణ యుద్ధం జరిగినట్లు మాట్లాడటం అత్యంత హేయమని వారు విమర్శించారు. పదే పదే హిందూ దేవుళ్లను అవహేళన చేస్తూ మతపరమైన విద్వేషాలను రెచ్చగొడుతున్న ప్రకాష్ రాజ్‌పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేల్పుల రమేష్,ఉప్పు కిరణ్,మండల ప్రధాన కార్యదర్శి ఉమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి గుడ్ల సతీష్, ముంజ రాజేందర్,షిండే శివ సాయి,కుక్క అంజి,గాదాసి సతీష్‌లతో పాటు పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుల్లకోట గ్రామంలో ఇల్లు లేని నిరుపేద పొన్నం లక్ష్మి

## - రెక్కాడితే గాని డొక్క నిండని నిరుపేద కుటుంబం ఇల్లు కట్టుకోలేని దీనస్థితి




ఎండపల్లి, ఏప్రిల్ 18 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామం లో పొన్నం లక్ష్మి భర్త అంజయ్య వీరికి ఒక కుమారుడు కలడు. వీరు ముగ్గురు ఉండేది ఇదే గుడిసెలో వీరికి రెక్క ఆడితే గాని డొక్కా నిండని దీన కుటుంబం వీరు ఇల్లు కట్టుకోలేని దీన స్థితిలో ఉన్నారు. వీరికి మాడల్ హౌస్ కింద ఇంది రమ్మ ఇల్లు మంజూరు చేయించా లని వీరు వేడు కుంటున్నారు. వీరు దీన స్థితిలో ఉంటూ కాలం వెళ్ళదీసు కుంటున్నారు. వీరికి మొదటి ఫేస్ లో ఇందిరమ్మ ఇల్లు వస్తాదని అనుకున్నారు కానీ తీర టైం కు రాలేకపోయిందని అధికారులు ప్రజా ప్రతినిధులు అన్నారని వీరు అనడం జరిగింది. గ్రామ సర్పంచు గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ ను వివరణ అడుగ గా వీరు కట్టుకోలేని దీన స్థితిలో ఉన్నా మాట వాస్తవమేనని సర్పంచ్ మల్లేష్ గౌడ్ చెప్పడం జరిగింది. వీరికి మోడల్ హౌస్ కింద సాధ్య మైనంతవరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో మాట్లాడి మోడల్ హౌస్ కింద ఇందిరమ్మ ఇల్లు కు మంత్రి తో మాట్లాడి వీరికి మోడల్ ఉసికింద ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ ఇప్పిస్తామని సర్పంచు మల్లేష్ గౌడ్ హామీ ఇవ్వడం జరిగింది. అలాగే ఎండపల్లి మండల ఎంపీడీవో దొండ కృపాకర్ ను వివరణ అడుగ గా మేము గ్రామాలలో సర్వే చేయించాం అట్లాంటి వారు పేరు ఆ లిస్టులో ఉన్న లేకున్నా ఒకటైతే మా దృష్టికి వచ్చిందని ఒకవేళ వాల్లు కొట్టుకో లేని దీన స్థితిలో ఉంటే మేము మోడల్ హౌస్ కింద ఇందిరమ్మ ఇల్లుకు పై అధికారుల కు పంపిస్తామని అలాగే మంత్రి గారి దృష్టికి కూడా తీసుకు వెళ్తామని ఎంపీడీవో దొండ కృపాకర్ తెలిపారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## -ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లి,ఏప్రిల్ 18:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. శనివారం కాల్వ శ్రీరాంపూర్ మండల



కేంద్రంలో మరియు ఓదెల మండలం పోత్కపల్లి గ్రామ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందుగానే కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చామని,రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాకు రూ. 2,400 మద్దతు ధర నిర్ణయించిందని,రైతులు దళారులను నమ్మి మోసపోకుండా నాణ్యతా ప్రమాణాల ప్రకారం పంటను కేంద్రాలకు తీసుకువచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు,ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారులు,మార్కెట్ కమిటీ చైర్మన్లు,కాల్వ శ్రీరాంపూర్ఓదెల మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు,రైతులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల సత్వర పరిష్కారమే ధ్యేయం

- మహిళా,రూరల్ కేసులకు ప్రత్యేక ప్రాధాన్యత
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల
- వర్చువల్‌గా నూతన కోర్టును ప్రారంభించిన హైకోర్టు సీజే



పెద్దపల్లి,ఏప్రిల్ 18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కోర్టు సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు హాల్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ శనివారం వర్చువల్ విధానంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కొత్త కోర్టు అందుబాటులోకి రావడంతో జిల్లా కోర్టులో మొత్తం కోర్టు హాల్ల సంఖ్య నాలుగుకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని,న్యాయ ప్రక్రియను వేగవంతం చేసేందుకు హైకోర్టు ఈ అదనపు కోర్టును మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో ఒకే మెజిస్ట్రేట్ కోర్టు ఉండటం వల్ల కేసుల పరిష్కారంలో కొంత ఇబ్బంది ఎదురయ్యేదని,ఈ నూతన కోర్టుతో ఆ సమస్య తీరుతుందని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా పోలీస్ స్టేషన్ మరియు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులను ఇకపై ఈ నూతన కోర్టులో విచారిస్తారని ఆమె వెల్లడించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మరియు మహిళలకు సంబంధించిన కేసులను ప్రాధాన్యత క్రమంలో త్వరగా పరిష్కరించడమే ఈ కోర్టు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. కేసులు ఈ కొత్త కోర్టుకు బదిలీ అయిన కక్షదారులకు తిరిగి తాజాగా నోటీసులు లేదా సమన్లు పంపబడతాయని,ప్రజలు ఈ మార్పును గమనించాలని ఆమె సూచించారు. నూతన కోర్టు ఏర్పాటుతో జిల్లాలో న్యాయ సేవలు మరింత చేరువవుతాయని ఈ సందర్భంగా అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎన్. మంజుల,డీసీపీ రామ్ రెడ్డి,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మెకల మల్లేశం,ప్రదాన కార్యదర్శి రాచూరి శ్రీకాంత్,ఏజీపీ ఉప్పు రాజు,ట్రేజరర్ బొంకూరి సంతోష్ బాబ్జీ,లైబ్రరీ సెక్రటరీ పుట్ట రవి,సీనియర్ న్యాయవాదులు గౌరిశెట్టి సత్యనారాయణ, అమెరిశెట్టి కృష్ణ, బర్ల రమేష్ బాబు,మహిళా ప్రతినిధులు జూనియర్ గ్జిక్యూటివ్ మెంబర్ కుమం సంతోష్,రాజు కార్తీక్,తదితర న్యాయవాదులు, కోర్టు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# నవభారత శిల్పులు విద్యార్థులే

మాస్టర్ సిద్ధార్థ పాఠశాల చైర్మన్ దొనకంటి వెంకటేశ్వర్ రావు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు - చిన్నారులకు మెమెంటోల ప్రదానం..జర్నలిస్టులకు ఘన సన్మానం





పెద్దపల్లి,ఏప్రిల్ 18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

విద్యార్థులు కేవలం పుస్తక పఠనానికే పరిమితం కాకుండా,రేపటి నవభారత నిర్మాతలుగా ఎదిగి దేశ రూపురేఖలను మార్చే దిశగా అడుగులు వేయాలని మాస్టర్ సిద్ధార్థ పాఠశాల చైర్మన్ దొనకంటి వెంకటేశ్వర్ రావు పిలుపునిచ్చారు. శనివారం పాఠశాల ఆవరణలో అత్యంత వైభవంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, పట్టుదలను అలవరుచుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న రాజకీయ, సామాజిక మార్పులపై నిరంతరం అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అప్పుడే విద్యాభ్యాసం పూర్తయ్యాక సమాజంలో ఒక బాధ్యతాయుతమైన పౌరులుగా సరికొత్త చరిత్రను లిఖించడానికి మార్గం సుగమం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న చిన్నారులకు చైర్మన్ చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. పట్టా పొందిన ఆనందంలో చిన్నారులు,వారి తల్లిదండ్రుల ముఖాల్లో సంతోషం వెల్లివిరిసింది. ఇదే వేదికపై సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల విశిష్ట సేవలను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా గుర్తించింది. క్షేత్రస్థాయిలో వార్తా సేకరణ చేస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తున్న సీనియర్ జర్నలిస్టులు కీర్తి రమేష్,బెజ్జంకి నరేష్,ఎర్రోజు వేణుగోపాల్,గుడ్ల శ్రీనివాస్, అర్కూటి మల్లేష్,వీరమల్ల విద్యాసాగర్ రావు,కేతిరెడ్డి ప్రవీణ్ రెడ్డిలను దొనకంటి వెంకటేశ్వర్ రావు శాలువాలతో ఘనంగా సన్మానించి,జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీలు లహరి,స్రవంతి,శరణ్య,హారికలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రైవేటు ఆసుపత్రులు కాదన్నా..సర్కారు వైద్యులు 'సై' అన్నారు

- చిద్రమైన కాలుకు టైటానియం సర్జరీ ప్రభుత్వ వైద్యుల అద్భుత విజయం

పెద్దపల్లి,ఏప్రిల్ 18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రి క్లిష్టమైన శస్త్రచికిత్సలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. వారం క్రితం కరీంనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెద్దపల్లికి చెందిన 14 ఏళ్ల బాలుడికి జిల్లా ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి ఊరటనిచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించగా,అది అత్యంత క్లిష్టమైన సర్జరీ అని,ఖర్చు భారీగా అవుతుందని వైద్యులు తెలపడంతో నిరుపేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. వారం తర్వాత బాలుడి తల్లిదండ్రులు పెద్దపల్లి మాతా శిశు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్‌ను కలిసి తమ సమస్యను వివరించగా,ఆయన తక్షణమే స్పందించి ఆర్థో సర్జన్లకు పరీక్షించాలని సూచించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు,కుడి మోకాలి ఎముక వెనుక భాగంలో ఎముక తుక్కుతుక్కుగా విడిపోయి ఉండటాన్ని గమనించారు. శనివారం సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కుమార్ గౌడ్,డాక్టర్ వినయ్ కుమార్, అనస్థీషియా డాక్టర్ రామంల బృందం కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేసే ఖరీదైన టైటానియం స్క్రూలతో ఓపెన్ రిడక్షన్ అండ్ ఇంటర్నల్ ఫిక్సేషన్ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసి ఎముకను సరిచేశారు. ఈ విజయం సాధించిన వైద్య బృందాన్ని,ఓటీ సిబ్బందిని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో నవజాత శిశు కేంద్రం,2డి ఎకో,లాప్రోస్కోపిక్,యూరాలజీ మరియు రూట్ కెనాల్ వంటి అత్యాధునిక సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసుపత్రిలో సానిటేషన్,వాష్ రూమ్ల నిర్వహణ విషయంలో ఎవరైనా డబ్బులు అడిగితే నేరుగా ఆర్ఎమ్ఓను లేదా తనను సంప్రదించాలని,ప్రభుత్వ వైద్యం పూర్తిగా ఉచితమని,ఎవరూ ఎవరికీ లంచం ఇవ్వకూడదని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# మహిళా బిల్లును అడ్డుకోవడం విపక్షాల చారిత్రక తప్పిదం

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం

పెద్దపల్లి,ఏప్రిల్ 18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

మహిళా సాధికారతపై పార్లమెంటులో కాంగ్రెస్ మరియు ఇండి కూటమి ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయని బీజేపీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం తీవ్రంగా విమర్శించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ,మహిళా శక్తి వందన అధినియం బిల్లును అడ్డుకోవడం ద్వారా ప్రతిపక్షాలు తమ మహిళా వ్యతిరేక స్వభావాన్ని బయటపెట్టుకున్నాయని, ఇది భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి రోజని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చారిత్రక నిర్ణయం తీసుకుంటే,దానిని అడ్డుకోవడం దేశంలోని సగభాగం ఉన్న మహిళా లోకానికి చేసిన ద్రోహమని ఆయన ధ్వజమెత్తారు. వేదికలపై గంభీర ఉపన్యాసాలు ఇచ్చే కాంగ్రెస్ నాయకులు,సభలో మాత్రం మహిళా రిజర్వేషన్లపై కుంటి సాకులు వెతుకుతున్నారు. ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న కుట్ర మాత్రమే. అడ్డుకుంది బిల్లును కాదు,కోట్లాది మందిఆడబిడ్డల ఆత్మగౌరవం అని సదానందం ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లును కేవలం మేనిఫెస్టోలకే పరిమితం చేసిందని,నేడు మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుంటే ఓర్వలేక ఆటంకాలు సృష్టిస్తోందని ఆరోపించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రతిపక్షాల ప్రతి ప్రశ్నకూ స్పష్టత ఇచ్చినా,విపక్షాలు మొండి వైఖరి వీడలేదని గుర్తు చేశారు. మహిళల అభివృద్ధి కంటే తమ రాజకీయ మనుగడే ముఖ్యమని భావిస్తున్న ఈ కూటమికి రాబోయే 2029 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఉన్న మహిళలంతా తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ఆయన హెచ్చరించారు.



# మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి



- ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్

పెద్దపల్లి,ఏప్రిల్ 18:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 15 శాతం ఎస్సీ రిజర్వేషన్లలో,జనాభా ప్రాతిపదికన మాదిగలకు 11శాతం కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్.ఎస్ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్,ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలులో అనుసరిస్తున్న విధానాలపై వారు అసహనం వ్యక్తం చేశారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గతంలోనే చెప్పినట్లుగా, కుల గణన సర్వే ద్వారా మాదిగల జనాభా 10 నుండి 11శాతం వరకు ఉందని స్పష్టమైందని వారు గుర్తు చేశారు. ఒకవేళ కుల గణన మరింత శాస్త్రీయంగా జరిగితే,ఈ జనాభా సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. కొంతమంది మేధావుల ముసుగులో పాలకుల మెప్పు కోసం జాతికి అన్యాయం చేస్తున్నారని. కేవలం 9 శాతం రిజర్వేషన్లను స్వాగతించిన వారు మాదిగ జాతికి ద్రోహం చేశారని,అలాంటి వారికి సమాజంలో స్థానం ఉండదు అని వారు హెచ్చరించారు. వర్గీకరణ చట్టం వచ్చే సమయంలోనే మందకృష్ణ మాదిగ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి 11శాతం వాటా కావాలని విజ్ఞప్తి చేశారని,ఇప్పుడు ఆ అన్యాయాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపైనే ఉందని వారు స్పష్టం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశత జయంతి ఉత్సవాల అత్యున్నత కమిటీలో మందకృష్ణ మాదిగకు చోటు కల్పించడం పట్ల దేశ ప్రధాని నరేంద్ర మోడీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇది యావత్ మాదిగ జాతికి దక్కిన గౌరవమని కొనియాడారు. మాదిగలు మరింత సంఘటితమై బలమైన శక్తిగా ఎదగాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంథని చందు మాదిగ, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మడిపల్లి దశరథం,జిల్లా కార్యదర్శి కాసిపేట రాజయ్య,రామగిరి మండల్ ఇంచార్జ్ అగ్గిమల్లా కొమురయ్య,గోదావరిఖని పట్టణ అధ్యక్షుడు కాసిపేట సాధనందం,ఎంఎస్పీ నాయకులు రాచర్ల రాజేశం,కుక్క శ్రావణ్, కొంకటి లింగమూర్తి,ఎంఎస్ఎఫ్ నాయకులు కొండ్రా వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సమాజ రక్షణే మా లక్ష్యం

బజరంగదళ్ నగర సంయోజక్ మణిదీప్ - వికృత జిహాదీ పోకడలపై భజరంగదళ్ నిరసన



పెద్దపల్లి,ఏప్రిల్ 18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

దేశంలో పెరుగుతున్న వికృత జిహాదీ మనస్తత్వం,ప్రణాళికాబద్ధంగా జరుగుతున్న అసాంఘిక సంఘటనలకు వ్యతిరేకంగా బజరంగదళ్ పోరాటానికి పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా పెద్దపల్లిలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టి,హిందూ అమ్మాయిలకు అవగాహన చేపట్టారు. ఈ సందర్భంగా బజరంగదళ్ నగర సంయోజక్ మణిదీప్ మాట్లాడుతూ నాసిక్ టిసిఎస్ సాఫ్ట్‌వేర్ సంస్థలో వెలుగుచూసిన ఘటనతో పాటు దేశవ్యాప్తంగా లవ్ జిహాద్ కుట్రలు,అటవీ భూములు,ప్రభుత్వ భూములు,సైనిక,రైల్వే భూములను ఆక్రమించడం,ఆహార పదార్థాలను ఉద్దేశపూర్వకంగా అపవిత్రం చేయడం,వేధింపులు,ముస్లింజనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో హిందూ కుటుంబాలను హింసించడం,గిరిజన బాలికల పట్ల జరుగుతున్న అకృత్యాలు, దేశవ్యతిరేక,సామరస్యానికి భంగం కలిగించేటువంటి మనస్తత్వానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచడమే బజరంగదళ్ లక్ష్యమని తెలిపారు. హిందుసమాజం ఇలాంటి హిందు వ్యతిరేక చర్యలని తిప్పికొట్టాలని మణిదీప్ పిలుపునిచ్చారు. హిందూసమాజ రక్షణ విషయంలో బజరంగదళ్ ఎలాంటి చర్యలకైనా వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. చర్యకి ప్రతిచర్యలు తప్పకుండా చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాతృశక్తి జిల్లా సంయోజిక ఠాకూర్ తారాభాయ్,సత్సంగ్ ప్రముఖ బొమ్మకంటి రవి,బజరంగదళ్ నగర సహ సంయోజక్ గుమ్మడి చందు,వంశీ, సిద్ధూ,అఖిల్,చరణ్,అభి,మహేందర్,ప్రఖండ సహ సంయోజిక రంగువాణి, దుర్గావాహిని బాద్యులు మౌనిక,రూప,మంతెన పూర్ణిమ,సేవిక సమితి కార్యకర్తలు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనగణన పనులను సమయానికి పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ఎండపల్లి ధర్మారం, ఏప్రిల్ 18 :(ప్రజా కలం ప్రతినిధి)

జనగణన 2027 కార్యక్రమాన్ని సమయపాలనతో, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. శనివారం రోజున జూలపల్లి, ధర్మారం మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాల యాలలో జనగణన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జనగణన కార్యక్రమం లో భాగంగా హెచ్ ఎల్ బీ నిర్దారణ ప్రక్రియను వేగ వంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి 300 ఇండ్లు లేదా 800 జనాభాకు ఒక హెచ్.ఎల్.బీగా విభజించి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ధర్మారం మండలం లో మొత్తం 87 హెచ్.ఎల్.బీలు ఉన్నాయని, ఏ బృందంపై అదనపు భారం లేకుండా సమానంగా పనులను విభజించినట్లు తెలిపారు. ప్రతి హెచ్.ఎల్.బీని మ్యాప్ సక్రమంగా గుర్తించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. ఈసారి జనగణన లో సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రజలకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ గురించి అవగాహన కల్పించాలని కనీసం 20 శాతం మంది ఈ విధానం ద్వారా వివరాలు అందిస్తే ఫీల్డ్ సిబ్బందిపై భారం కొంత తగ్గు తుందని సూచించారు. హౌస్ లిస్టింగ్ కార్యక్రమం మే 10నుండి ప్రారంభమవుతుందని ప్రతి ఇంటి నుంచి అవసరమైన





సమాచా రాన్ని ఖచ్చితంగా సేకరించాలని తెలిపారు.

ఫీల్డ్ సర్వే సమయం లో ఎలాంటి లోపాలు లేకుండా ఎన్యూమరేటర్లు సమగ్రంగా పనిచేయాలని ఆదేశించారు. ఎన్యూమరేషన్ ప్రక్రియ ఎండా కాలం లో జరుగుతున్నందున పని సమయాలను ఉదయం తొందర గా సాయంత్రం వేళల్లో ప్రణాళిక చేయాలని సూచించారు. అవ సరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య భద్రతపై దృష్టి పెట్టాలని అన్నారు. సేకరించిన వివరాలను మొబైల్ యాప్‌లో నిరంతరం అప్డేట్ చేయాలని డేటా ఎంట్రీలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జనగణన కార్య క్రమం అత్యంత ముఖ్య మైనదని ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయ రాదని కలెక్టర్ హెచ్చరించారు. సంబంధిత అధికారులు సమన్వ యం తో పనిచేసి నిర్ణీత గడువు లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో ఎంపీడీవోలు, తహసిల్దారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో హోరెత్తిన బీసీ మహిళల పోరుదీక్ష

- సబ్ కోటా కోసం జంతర్ మంతర్ వద్ద బీసీల గర్జన

పెద్దపల్లి,ఏప్రిల్ 18:
(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ఖచ్చితమైన సబ్ కోటా కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా బీసీ మహిళల పోరుదీక్ష శనివారం హోరెత్తింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మార్గదర్శకత్వంలో,బీసీ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు బి. మణి మంజరి అధ్యక్షతన జరిగిన ఈ దీక్షకు దేశవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాల ప్రతినిధులు,మహిళా నేతలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ నిరసన కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు హాజరై బీసీ మహిళల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర,శాసనసభ పక్ష నేత,మాజీ స్పీకర్ సి. మధుసూదనా చారి,మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హనుమంత రావు, ఏఐసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్,టీడీపి ఎంపీలు బీద మస్తాన్ రావు, అంబిక లక్ష్మీనారాయణ, ఏపీ టీడీపి బీసీ సెల్ అధ్యక్షులు కేసన శంకర్రావు తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీ మహిళలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించినప్పుడే దేశంలో నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ కోటా లేకపోవడం వల్ల మెజారిటీ జనాభా ఉన్న వర్గాలకు అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష పాల్గొని తమ గళాన్ని వినిపించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మహిళా బిల్లులో బీసీ సబ్ కోటాను చేర్చాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఈ పోరుదీక్ష వేదికగా హెచ్చరించారు.



## అంగన్వాడీ లో పోషణ పక్వాడా కార్యక్రమం



గొల్లపల్లి ఏప్రిల్ 18 ప్రజా కలం ప్రతినిధి : గొల్లపల్లి మండలం తిరుమలాపూర్ (పి డి) మొదటి అంగన్వాడీ కేంద్రంలో 'పోషణ్ పక్వాడా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో మహిళలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్న పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీడీపీఓ వీర లక్ష్మి, సూపర్ వైజర్ జానకి, గ్రామ సర్పంచ్ కాష అంజలి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, ఎదిగే చిన్నారులకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను, వాటి ప్రాముఖ్యతను గురించి వివరించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం, పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీచర్లు ఎండి. లాల్ బి, కె. హరిత, ఆశా కార్యకర్తలు వసంత, ఉమా, మంగ , ఆయాలు, బాలింతలు, గర్భిణులు పిల్లలు పాల్గొన్నారు.

## "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



నిర్మల్ ఏప్రిల్ 18 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా ఈరోజు నిర్మల్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారికి జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, మాట్లాడుతూ... మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమే కాకుండా ప్రాణాపాయం కలిగించే చర్య అని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చిన్నపిల్లలు డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలు చాలా తీవ్రమైనవని, అలాంటి ఘటనల్లో ప్రాణ నష్టం, శాశ్వత గాయాలు కలగవచ్చని వివరించారు.అదేవిధంగా, వేగ పరిమితులు పాటించడం, హెల్మెట్ సీట్ బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం వంటి ప్రాథమిక రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో తల్లితండ్రులదే బాధ్యత అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తో పాటు టౌన్ ఇన్స్పెక్టర్ సమ్మయ్య,ఆర్.ఐ రామ్ నిరంజన్ రావ్,ఎస్.ఐ లు,ఆర్.ఎస్.ఐ లు, మైనర్ల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పేద ప్రజల దాహార్తిని తీర్చటం అభినందనీయం

### - వైరా వైస్ చైర్మన్ కట్ల సంతోష్..




వైరా, ఏప్రిల్ 18 (ప్రజాకలం న్యూస్): వేసవికాలంలో ప్రయాణాలు చేసే పేద ప్రజల దాహార్తిని తీర్చటం అభినందనీయమని వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ అన్నారు. శనివారం వైరా బస్టాండ్ సెంటర్ లో మోక్షిత నిధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు తాగునీటితోపాటు మజ్జిగ ప్యాకెట్లను అందించటం సంతోషకరమన్నారు. మానవసేవే మాధవసేవ అని, ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలనీ సూచించారు. ఈ సందర్భంగా మోక్షిత నిధి ఫౌండేషన్ ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు రాయల రాము..

తల్లాడ ఏప్రిల్ 18 ( ప్రజా కలం న్యూస్ ):

గత మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సిపిఐ మండల కార్యదర్శి ఓర్స్ రమేష్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల రాము శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడారు. రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందటం బాధాకరమని, అధైర్య పడోద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అయినాల నరసింహారావు, ప్రముఖ న్యాయవాది గుర్రాల బ్రహ్మారెడ్డి, దగ్గుల శ్రీనివాసరెడ్డి, మద్ది రామయ్య, బయ్యవరపు శ్రీనివాస్, శ్రీకాంత్, రామకృష్ణ, దాచేపల్లి వెంకన్న తదితరులు ఉన్నారు.



## మలబార్ గోల్డ్, డైమండ్స్ షో రూమ్ లో

# ఆర్టిస్ట్రీ ఎగ్జిబిషన్మేయర్ ప్రారంభం

ఖమ్మం ఏప్రిల్ 18( ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం నగరంలోనే శనివారం మలబార్ గోల్డ్ డైమండ్స్ షో రూమ్ లో ఆర్టిస్ట్రీ ఎగ్జిబిషన్ ను మేయర్ పునుకొల్లు నీరజ , కార్పొరేటర్ శ్రావణి సుధాకర్ , డాక్టర్ రాధిక , డాక్టర్ కూరపాటి ప్రీతి, కస్టమర్ అంచుమల్ల స్వర్ణ , శ్రావ్య లు ప్రారంభించారు . ఆర్టిస్ట్రీ షోలో ప్రత్యేక ఆకర్షణలుగా మలబార్ గోల్డ్ ఉ డైమండ్స్ వారి బ్రాండుల సమాహారం "మైన్" ధ్రువీకరించిన వజ్రాభరణాలు , వివాహం, పార్టీ సంబరాల కోసం, "ఎరా" అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి, "ప్రెష్యా" జాతిరత్నాభరణాల సముదాయం, "ఎత్నిక్స్" హస్తకళా నైపుణ్యతతో తయారైన ఆభరణాలు , "జోల్" అధునాతన డిజైన్లతో తేలికపాటి ఆభరణాలను ఇష్టపడే మగువల మనసులు దోచుకునే విధంగా ఉన్నాయన్నారు . "డివైన్" భారతీయ ప్రాచీన సంప్రదాయం వ్యక్తం చేసే ఆభరణాలు ఇంకా చిన్నారుల కోసం "స్టార్లెట్" పిల్లల ఆభరణాలు సమకూర్చారు . ఈ ప్రదర్శన మలబార్ గోల్డ్ ఉ డైమండ్స్ ఖమ్మంలో 17 ఏప్రిల్ నుండి 20 ఏప్రిల్ వరకు ఆర్టిస్ట్రీ ఎగ్జిబిషన్ షో ప్రదర్శించబడతాయన్నారు . మలబార్ గోల్డ్ ఉ డైమండ్స్ నిబద్ధతలో భాగంగా, తమ వినియోగదారులకు 12 న్యాయమైన వాగ్దానాలను అందిస్తుంది . ఖచ్చితమైన తయారీ ధర , రాళ్ల బరువు , నికర బరువు, ఆభరణాల రాళ్ల విలువతో కూడిన పారదర్శక ధరల పట్టి , ఆభరణాలకు జీవితకాల ఉచిత నిర్వహణ ,



పాత బంగారు ఆభరణాలను తిరిగి విక్రయించేటప్పుడు బంగారానికి 100 శాతం విలువ, బంగారం మార్పిడిపై శూన్య తగ్గింపు, వజ్రాభరణాల మార్పిడి పై 100 శాతం విలువ, నూరు శాతం బి.ఐ.ఎస్ హాల్ మార్క్ తో ధృవీకరించబడిన స్వచ్ఛమైన హుయిడ్ (హుయిడ్ ) బంగారం , అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 28 పాయింట్ల నాణ్యత పరీక్షలు నిర్వహించిన ఐజిఐ, జిఐఎ ధృవీకరించిన వజ్రాభరణాలు, బైబ్యాక్ గ్యారెంటీ, నాణ్యతను తనిఖీ చేయడానికి క్యారెట్ ఎనలైజర్, జీవితకాల నిర్వహణ, బాధ్యతాయుతమైన మూలాల నుండి బంగారం సేకరణ వంటి వాగ్దానాలను అందిస్తుందని తెలిపారు . ఈ కార్యక్రమంలో స్టోర్ హెడ్ ఎం.విష్ణు , అసిస్టెంట్ స్టోర్ హెడ్ నిహాడ్ , స్టోర్ మేనేజర్ కిషన్ రావు , అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ విష్ణు , విజయ్ , మార్కెటింగ్ ఇంచార్జి రుద్ర రామకృష్ణ పాల్గొన్నారు.

## తెలంగాణ కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను తెలంగాణ సెక్రటేరియట్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం సిగ్గుచేటు

### - రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె వి కృష్ణారావు



ఖమ్మం ఏప్రిల్ 18( ప్రజా కలం న్యూస్)

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ( రిజిస్టర్డ్ ) రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ పిలుపుమేరకు తెలంగాణ వ్యాప్తంగా వందల మంది ఉద్యమకారులతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హైదరాబాద్ సెక్రెటరీ భవనం ముట్టడి లో భాగంగా ఖమ్మం నుండి ఉద్యమకారులు రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె వి కృష్ణారావు , ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు . తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని రెండు నెలల్లో అమలు చేయాలని గౌరవ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది ఈ నెల 23వ తారీకు రెండు నెలల గడువు ముగుస్తున్నది ప్రిన్సిపల్ సెక్రటరీ గారికి వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన తెలంగాణ ఉద్యమకారులను అరెస్టు చేయడని తీవ్రంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ( రిజిస్టర్డ్ ) రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె వి కృష్ణారావు ఖండించారు . తెలంగాణ కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను తెలంగాణ సెక్రటేరియట్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం సిగ్గుచేటు అని మండిపడ్డారు . అరెస్టు చేసి వివిధ స్టేషన్లో పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే తెలంగాణ ఉద్యమకారుల కు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి , తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ఐడెంటి కార్డు ఇవ్వాలి , ఉద్యమకారులకు ప్రతినెల స్వతంత్ర సమరయోధులకు ఇస్తున్నట్లు 25 వేల పెన్షన్ ఇవ్వాలి , తెలంగాణ ఉద్యమకారులకు నివాసయోగ్యమైన 250 గజాల స్థలం మరియు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి , ప్రభుత్వము చట్టబద్ధత కలిగిన కమిటీని ఏర్పాటు చేయాలి , హైదరాబాదులో తెలంగాణ ఉద్యమకారుల కు తెలంగాణ భవన్ నిర్మాణం కొరకు రెండెకరాల భూమి మరియు 50 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు బచ్చల పద్మాచారి , పగడాల నరేందర్ , లింగానబోయిన సతీష్ , బత్తిన మధు గౌడ్ , నెలవెల్లి వెంకటేశ్వరావు , భుక్య శ్రీనివాస్ నాయక్ , కొండ్రు రజనీకాంత్ , అజ్మీరావీరన్న , బానోతు రాంబాబు , గొట్టిపర్తి శ్రీనివాస్ , మోత్కురి వెంకటాచారి , అశోక్ సింగ్ , గాజుల రవి , ఎస్ కే యాకూబ్ , గాలి రాము , ఇనుప శీను , కొట్టే ఉపేందర్ , ఇనుప సుందర్రావు , పసుపులేటి శ్రీనివాస్ , రాజు , బాబురావు తదితరులు పాల్గొన్నారు .

# సంక్షేమ వారం పకడ్బందీగా అమలు చేయాలి

### - ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం, ఏప్రిల్ 18( ప్రజా కలం న్యూస్ )

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న 7 రోజుల సంక్షేమ వారాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, సంక్షేమ శాఖలు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ గురుకులాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు.

కీలక సూచనలు

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్విజ్, విద్యా విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలి.

వసతి గృహాల్లో మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి; తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయాలి.స్కిల్ డెవలప్మెంట్, వేసవి శిబిరాలు, బడి బాట కార్యక్రమాలు సమర్థవంతంగా నడుపాలి.




ఖమ్మం జిల్లాలోని 181 సంక్షేమ హాస్టళ్లలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలి. ప్రతి హాస్టల్‌కు ప్రత్యేక అధికారులు రోజువారీ పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

రైతు నమోదు పురోగతి

ఫార్మర్ రిజిస్ట్రేషన్ 82 శాతం పూర్తైంది; రాష్ట్రంలో రెండో స్థానం. జూన్ 2లోగా 100% పూర్తి చేయాలని వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సంక్షేమ వారాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్డీఏ శ్రీరాం, సంక్షేమ శాఖ అధికారులు జ్యోతి, నవీన్ బాబు, విజయలక్ష్మి, హౌసింగ్ శాఖ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గిడ్డంగుల సంస్థ మేనేజర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు..



ఖమ్మం ఏప్రిల్ 18(ప్రజా కలం న్యూస్ ) హైదరాబాద్ నాంపల్లి లోని గిడ్డంగుల సంస్థ కార్యాలయంలో నుండి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సంస్థ రీజినల్ మేనేజర్స్, మేనేజర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు..పనుల పురోగతి,లక్ష్యాల సాధనపై చర్చించి, అవసరమైన సూచనలు అందించారు..ఈ సందర్భంగా రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన మొక్కజొన్న లను నిల్వ చేసేందుకు అవసరమైన గోడౌన్ లను సిద్ధంగా ఉంచాలన్నారు.. స్టోరేజ్ చార్జెస్ త్వరగా వసూలు చేయాలన్నారు.. తద్వారా కార్పోరేషన్ ను అభివృద్ధి లో నడిపించాలని చెప్పారు. నూతనంగా నిర్మిస్తున్న గోడౌన్ లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు..ఈ కార్యక్రమంలో యండి కోర్రా లక్ష్మి,సెక్రటరీ జయ ప్రకాష్ రెడ్డి,యస్.ఈ శ్రీనివాస్,జనరల్ మేనేజర్ సురేష్,వేణుగోపాల్, కుమారి, పద్మావతి,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ మోడెం వంశీని మరియు డివి శంకర్రావుని అభినందించిన తలసాని శ్రీనివాస్ యాదవ్

### - జిల్లా ప్రధాన కార్యదర్శి జివి రామిరెడ్డి

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, ఏప్రియల్ 18: హైదరాబాద్ రాష్ట్రంలో తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్, జూనియర్ మరియు మాస్టర్స్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీల ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గారు ఇంటర్నేషనల్ పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులకు సన్మానం చేస్తున్న సందర్భంలో మోడెం వంశీకి మరియు నేషనల్ గోల్డ్ మెడలిస్ట్ డివి శంకర్రావు గారిని సాలువాతో సత్కరించి ఘనంగా అభినందించడం జరిగింది. ఇంతటి విజయాలు సాధించిన వీరిద్దరూ




భవిష్యత్తులో కూడా ఇంకా మరెన్నో విజయాలను కూడా సాధిస్తూ ఎంతమంది క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తూ ఇండియాకి కీర్తి ప్రతిష్ట తీసుకురావాలని వారి సందర్భంగా మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి మల్లేష్ గారు, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, ప్రధాన కార్యదర్శి, జివి రామిరెడ్డి, జిల్లా కోశాధికారి, మహంతి వెంకటకృష్ణాజి, మరియు జిల్లా క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## కూసుమంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షమాపణ చెప్పాలి

### - బీజేపీ నాయకుల డిమాండ్

పాలేరు ఏప్రిల్ 18 (ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మండల కేంద్రంలోని శుక్రవారం సాయంత్రం జరిగిన నిరసన కార్యక్రమంలో దగ్గర నుండి దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని



అవమానపరిచారని, దీనికి పూర్తి స్థాయిలో జవాబుదారిగా ఉన్న కాంగ్రెస్ నాయకుడు భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి ఘోషించారు. పాలేరు నియోజకవర్గం కూసుమంచి క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదుపరి బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను వక్రీకరించినట్లు ఆరోపణలు చేశారు. ఇందులో భాగంగా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కూడా అవమానపరిచినట్లు బీజేపీ నాయకులు ఆక్షేపించారు.అమితమైన కష్టంతో అహర్నిశలు దేశ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మోదీపై దిష్టి బొమ్మలు ఏర్పాటు చేయడం కాంగ్రెస్ పార్టీ జుగుప్సాకరమైన రాజకీయ వ్యూహంగా బీజేపీ చెప్పింది. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటూ మహిళలపై కాంగ్రెస్ పార్టీ చూపుతున్న వైఖరి ఆప్యాయత లేకపోవడానికి నిదర్శనమని, దీనివల్ల చరిత్రలో కాంగ్రెస్ "మహిళావ్యతిరేక పార్టీగా" నిలిచిపోతుందని వారు అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా జరిగిన తప్పును ఒప్పుకుని భేషరతుగా క్షమా పచన చెప్పాలని డిమాండ్ చేస్తూ, లేకపోతే కూసుమంచిలోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించి, ఆ కార్యాలయంలో ప్రవేశించకుండా అడ్డుకుంటామని బీజేపీ నాయకులు హెచ్చరించారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పశీలించిన సర్పంచ్ చీదురు శంకర్

( వరంగల్/పర్వతగిరి) ఏప్రిల్ 18, ప్రజాకలం ప్రతినిధి. పర్వతగిరి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతూ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా విషయం సర్పంచ్ దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో స్థానిక సర్పంచ్ చీదురు శంకర్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. మండల పరిధి గ్రామాలతో పాటు పరిసర గ్రామాల రైతులు అధిక సంఖ్యలో మొక్కజొన్నను మార్కెట్ యార్డుకు తీసుకురావడంతో యార్డు పూర్తిగా నిండిపోయిన పరిస్థితి



ఏర్పడింది. శనివారం దాదాపు 8 వేల బస్తాలు మార్కెట్‌కు చేరుకున్నప్పటికీ, సరిపడా కొనుగోలు జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్‌లో ఇప్పటికే ఉన్న మొక్కజొన్నకు కాంటాలు నిర్వహించాలంటే కనీసం 40 వేల బస్తాల సామర్థ్యం అవసరమని తెలుస్తోంది. ఈ సమస్యపై స్పందించిన సర్పంచ్ చీదురు శంకర్, పరిస్థితిని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకుని కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆయన కోరారు. రైతులు మాత్రం కొనుగోళ్లు వేగంగా జరపాలని, ఆలస్యం కారణంగా నష్టాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ సిఈఓ సురేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వ్యతిరేకతే లక్ష్యంగా ఇండియా కూటమి

### - బీజేపీ మండల అధ్యక్షులు బండ శ్రీకాంత్

మల్హర్, ఏప్రిల్ 18 ప్రజాకలం ప్రతినిధి : దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియం' బిల్లును



అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్, ఇండియా కూటమి తమ అసలు రంగు బయటపెట్టుకున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు బండ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రధాని మోదీ, అమిత్ షా విపక్షాల ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలిచ్చినా, కేవలం క్రెడిట్ రాకూడదనే కుట్రతోనే బిల్లుపై కుంటి సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. దశాబ్దాల కాలం అధికారంలో ఉండి బిల్లును మేనిఫెస్టోలకే పరిమితం చేసిన కాంగ్రెస్‌కు మహిళా సాధికారతపై మాట్లాడే అర్హత లేదన్నారు.మహిళల ఆత్మగౌరవంతో ఆటలాడుతున్న విపక్షాలకు 2029 ఎన్నికల్లో దేశంలోని ఆడబిడ్డలు సరైన బుద్ధి చెప్పడం ఖాయమని శ్రీకాంత్ హెచ్చరించారు.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

**- టీయూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడితనపల్లి ప్రభాకర్**

**- హైదరాబాద్ రాష్ట్ర సదస్సుకు తరలివెళ్లిన ఉద్యమకారులు**



మల్హర్, ఏప్రిల్ 18 ప్రజాకలం ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం తక్షణమే గుర్తించి న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (ఒఖఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ముడితనపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తార్నాకలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర స్థాయి సదస్సుకు భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలం నుండి ఉద్యమకారులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మార్గమధ్యలో సిద్దిపేటలోని అమరవీరుల స్తూపం వద్ద ఉద్యమకారులు నివాళులు అర్పించారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ.. దశాబ్ద కాలానికి పైగా పోరాడి రాష్ట్రం సాధించుకున్నా, ఉద్యమకారుల బతుకులు నేటికీ మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక కమిటీ వేసి ప్రతి ఉద్యమకారుడిని గుర్తించాలన్నారు. జార్ఖండ్ రాష్ట్రం తరహాలో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్, ఉచిత బస్సు, రైలు ప్రయాణ సౌకర్యంతో పాటు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రత్యేక చొరవ చూపి ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో మల్హర్ రావు మండల అధ్యక్షులు బూడిద సతీష్, ప్రధాన కార్యదర్శి చొప్పరి రాజు, మైనార్టీ నాయకులు షేక్ చాంద్ పాష, ఉద్యమకారులు కోట నవీన్, ఆకుల సదానందం, కోండ్ర సారయ్య, యాదండ్ల చిన్న గట్టయ్య, దుబాసి పార్వతి, జునగరి పద్మ, గడ్డం సమ్మక్క, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యుల ఉదారత

**మృతి చెందిన మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం**



మల్హర్,ఏప్రిల్ 18 ప్రజాకలం ప్రతినిధి మండల పరదిలోని మల్లారం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. తోటి గ్రామీణ వైద్యులు మృతి చెందిన వైద్యుని కుటుంబానికి 7500 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అధైర్య పడద్దు అండగా మేము ఉన్నాం అని మృతుని కుటుంబ సభ్యులకు దైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల మండల అధ్యక్షులు కే.అశోక్, జిల్లా సంయుక్త కార్యదర్శి సి హెచ్.కుమార్ యాదవ్, మండల కోశాధికారి రాజయ్య, సుధాకర్, అజీమ్, రవీందర్,శ్రీధర్, జిల్లా మెంబెర్ శ్రీనాథ్, బాపురావు,జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, మండల ప్రధాన కార్యదర్శి సమ్మయ్య పాల్గొన్నారు.

# నాగోల్ లో అరైవ్ - అలైవ్ కార్యక్రమం

**పాల్గొన్న మంత్రి పొన్నం**

హైదరాబాద్ : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా నాగోల్ బాబు జాగ్జీవన్ రామ్ డ్రైవింగ్ సెంటర్ లో అరైవ్ - అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామని అధికారులు, వాహనదారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి సంతకం చేయించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి ,జెటిసి లు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, రమేష్, ఎల్బీనగర్ డీసీపీ అనురాధ ,ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఆర్టీఏ మెంబర్ శివలాల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, కామినేని హాస్పిటల్ డాక్టర్స్ పాల్గొన్నారు.

# నిర్దేశిత గడువులో ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి

**టిటిడి జేఈవో డా. ఎ. శరత్**

తిరుపతి : తిరుపతిలో నిర్మాణంలో ఉన్న శ్రీ పద్మావతీ చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నూతన భవన నిర్మాణాన్ని నిర్ణయించిన గడువులో పూర్తి చేయాలని టిటిడి జేఈవో (వైద్యం, విద్య) డా. ఎ. శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆయన అధికారులతో కలిసి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, ప్రతి ఫ్లోర్‌లో ఒక గదిని మోడల్ యూనిట్‌గా అభివృద్ధి చేసి, ఆ గదిలో ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఫైర్ సేఫ్టీ, మెడికల్ ఎక్విప్‌మెంట్ తదితర సదుపాయాలను సమగ్ర ప్రణాళికతో ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని గదుల్లో ఆమోదిత లేఅవుట్‌కు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలన్నారు. పెండింగ్ పనులను సంబంధిత విభాగాలు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి గదిలో రోగి సేవలకు అవసరమైన మెడికల్ మరియు సపోర్ట్ సదుపాయాలు నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైతే ప్రముఖ ఆసుపత్రులలో అమలులో ఉన్న ఉత్తమ పద్ధతులపై నివేదికలు సేకరించి అమలు చేయాలని సూచించారు.అనంతరం నూతన భవనంలోని 6 అంతస్తుల గదులు, పై అంతస్తులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆసుపత్రి సమీపంలో అధికారులతో సమావేశమై నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిఈ టి.వి. సత్యనారాయణ, ఆసుపత్రి డైరెక్టర్ డా. ఎన్. శ్రీనాథ్ రెడ్డి, ఎస్.ఈలు మనోహరం, వేంకటేశ్వర్లు, డిఈ సరస్వతి, డిప్యూటీ ఈఈ హర్షవర్ధన్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ సురేష్ నాయక్ ఆత్మహత్య పై

# సిబిఐ విచారణ జరిపించాలి

**- లంబాడి హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర సమ్మయ్య నాయక్**

మల్హర్, ఏప్రిల్ 18 ప్రజాకలం ప్రతినిధి :

ఉస్మానియా మెడికల్ కళాశాలలో పీజీ విద్యార్థి, గిరిజన బిడ్డ డాక్టర్ సురేష్ నాయక్ అకాల మరణం పట్ల లంబాడి హక్కుల పోరాట సమితి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సురేష్ మృతికి కారణమైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించి ఆయన ఆత్మహత్య పై సిబిఐ విచారణ జరిపించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర సమ్మయ్య నాయక్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక నిరుపేద గిరిజన కుటుంబం నుండి ఎంతో కష్టపడి ఉస్మానియా వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో సీటు సాధించిన ఆశాకిరణం ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం తీరని లోటన్నారు. విద్యా వ్యవస్థలోని లోపాలు, సీనియర్ల వేధింపులు, ర్యాగింగ్ మరియు మితిమీరిన పనిభారం వల్లే సురేష్ తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. మెడికల్ పీజీ విద్యార్థులను లక్షల రూపాయల బాండ్లతో బంధించడం వల్ల, నచ్చని పరిస్థితుల్లో కూడా విద్యార్థులు బయటకు రాలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మృతి చెందిన సురేష్ నాయక్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ?1 కోటి నష్టపరిహారం చెల్లించాలని బాధిత కుటుంబంలో ఒకరికి



ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీలతో అధ్యయన కమిటీ వేయాలని అన్నారు. ర్యాగింగ్‌ను అరికట్టడంతో పాటు, మెడికల్ విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్న బాండ్ల విధానాన్ని వెంటనే పునఃసమీక్షించి

ప్రభుత్వం తక్షణమే స్పందించి సురేష్ నాయక్ కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## ఏప్రిల్ 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా

# “సంక్షేమ వారం” నిర్వహణ

**- సంక్షేమ విద్యా సంస్థల్లో సేవల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి**

**- విద్యార్థుల అభివృద్ధికి వారంతా ప్రత్యేక కార్యక్రమాలు**


**- హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల బలోపేతం**

**- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యచరణ లో భాగంగా చేపట్టనున్న వెల్ఫేర్ వీక్ అమలు పై జిల్లాల కలెక్టర్లులతో సమీక్షించిన సీఎస్ రామకృష్ణారావు**

ఖమ్మం, ఏప్రిల్ 18( ప్రజా కలం న్యూస్ )


తెలంగాణ సీఎస్ కె. రామకృష్ణారావు హైదరాబాద్ సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాలిక కార్యక్రమం అమలును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా “సంక్షేమ వారం” పాటించనున్నట్లు ఆయన తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ములుగు జిల్లా నుండి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణభివృద్ధి శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ మరియు ఆర్డబ్ల్యూఎస్ శాఖ మంత్రి సీతక్క, ఖమ్మం జిల్లా నుండి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. సంస్థాగత యంత్రాంగాలను బలోపేతం చేయడం, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో సేవల పంపిణీని మెరుగుపరచడం, విద్యార్థుల భాగస్వామ్యం, సమాజ భాగస్వామ్యాన్ని పెంపొందించడం ఈ సంక్షేమ వారం లక్ష్యాలు. నిర్ణీత కార్యక్రమాలన్నింటిలో పకడ్బందీ ప్రణాళిక, చురుకైన పర్యవేక్షణ, విస్తృత భాగస్వామ్యం ఉండేలా చూడాలని సీఎస్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఏప్రిల్ 20 న అన్ని సంక్షేమ విద్యా సంస్థలలో సమగ్ర వంటగది, పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టాలని పరిశుభ్రత ప్రమాణాలను నిర్ధారించడానికి అధికారులు సౌకర్యాలను సందర్శించి తనిఖీ చేయాలన్నారు. ఏప్రిల్ 21న సృజనాత్మకత, మేధో వికాసాన్ని ప్రోత్సహించడానికి, సంక్షేమ విద్యార్థుల కోసం క్విజ్, చర్చ మరియు డ్రాయింగ్ వంటి పోటీలతో కూడిన ప్రతిభా ఉత్సవాన్ని నిర్వహించాలి సూచించారు. ఏప్రిల్ 22 న హాస్టళ్లు మరియు రెసిడెన్షియల్ పాఠశాలల్లో చిన్నపాటి మరమ్మతులపై దృష్టి పెట్టాలి. అధికారులు అంచనాలను సిద్ధం చేసి, అవసరమైన అనుమతులు పొంది, వేసవి సెలవుల్లో పనుల అమలుకు షెడ్యూల్ రూపొందించాలన్నారు ఏప్రిల్ 23న విద్యా నైపుణ్యాన్ని ప్రోత్సహించడానికి, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు (పిటిఎంలు) నిర్వహించి, వాటిలో



ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించాలని తెలిపారు.ఏప్రిల్ 24న ఉపాధి అవకాశాలను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలను తెలియజేస్తూ, యువత కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాల వివరించారు. ఏప్రిల్ 25న విద్యార్థుల కోసం క్రీడలు, ఆటలు, కళలు, చేతిపనులు, సంగీతం, డిజిటల్ అక్షరాస్యత, వ్యక్తిత్వ వికాసం వంటి కార్యకలాపాలను చేర్చి వేసవి శిబిరాలను నిర్వహించాలి తెలిపారు.ఏప్రిల్ 26న రాష్ట్రంలోని అన్ని హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో “బడీ బాటా” కార్యక్రమాన్ని నిర్వహించాల వివరించారు. ప్రతి కార్యాచరణ అమలును నిశితంగా పర్యవేక్షించాలని, సరైన డాక్యుమెంటేషన్ ఉండేలా చూసుకోవాలని, రోజువారీ నివేదికలను సమర్పించి, చివరకు ప్రభుత్వానికి ఒక సమగ్ర ఏకీకృత నివేదికను అందించాలని అధికారులకు కలెక్టర్లకు సూచించారు.ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, పారదర్శకతను పెంచేందుకు అన్ని కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులను చురుకుగా భాగస్వాములను చేయాలని, ప్రభుత్వ ప్రధాన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం యొక్క ప్రాముఖ్యతను వివరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ శ్రీరాం సంక్షేమశాఖ అధికారులు జ్యోతి, నవీన్ బాబు, విజయలక్ష్మి, హౌసింగ్ శాఖ అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాళహస్తిలో రాహు, కేతు పూజలు



## ధరలు డబుల్ చేసిన పాలకమండలి

తిరుపతి : తిరుపతి జిల్లాలోని స్వర్ణముఖి నదీతీరంలో ఉన్న ప్రముఖ శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో పలు మార్పులు చేసిన ఆలయ పాలక మండలి వెల్లడించింది. ప్రధానంగా రాహు కేతు పూజలకు సంబంధించిన కీలక సంస్కరణలు చేసినట్లు తెలిపింది. సామాన్యులకు అందుబాటులోకి రాహు కేతు పూజలను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొంది. అదే సమయంలో పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా భారీగా పెరిగిన వెండి ధరలకు అనుగుణంగా రూ.5 వేల రాహు కేతు పూజ టికెట్ ధరను పెంచుతున్నట్లు వివరించింది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి.. ఆలయ ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్.. ఈవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలోఆలయంలోని పరిపాలన భవనంలో పాలక మండలి సమావేశమై కీలక అంశాలపై చర్చలు జరిపారు. ఈ సమావేశంలో ప్రధానంగా 14 అంశాలను చర్చించి.. వాటికి ఆమోదం కల్పించారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉన్న ప్రతీ సామాన్య భక్తుడికి రాహు కేతు పూజలను మరింత చేరువ చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. నియోజకవర్గంలో తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న వారికి కేవలం రూ.100కే సామూహిక రాహు కేతు పూజలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అయితే వారంలో బుధవారం మాత్రమే స్థానికులకు ప్రత్యేకంగా ఈ అవకాశం కల్పించనున్నట్లు పాలక మండలి తెలిపింది.ఇక వెండి ధరలు పెరుగుతూ ఉన్న నేపథ్యంలో రూ.500ల రాహు కేతు పూజలను రద్దు చేస్తూ పాలక మండలి కీలక నిర్ణయం తీసుకుంది. అదే సమయంలో రూ.5 వేల రాహు కేతు పూజలను మరో వెయ్యి రూపాయలు పెంచి.. రూ.6 వేలు చేసినట్లు ప్రకటించింది. అదే సమయంలో దీంతో రాహు కేతు పూజల ప్రారంభ టికెట్ ధర రూ.750గా ఉంది. ఆ తర్వాత రూ.1500, రూ.2500, రూ.6 వేలుగా టికెట్ ధరలను నిర్ణయించారు.ఈ క్రమంలోనే శ్రీకాళహస్తీశ్వరా లయంలోని రూ.500ల అంతరాలయం దర్శనం టికెట్ తీసు కునే భక్తులకు ఒక లడ్డు, ఒక వడను ఉచితంగా అందిం చాలని కూడా ఈ సమావేశంలో తీర్మానించినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు.. భరద్వాజ తీర్థం అభివృద్ధితోపాటు.. క్యూ లైన్లలో భక్తులు ఎక్కువసేపు వేచి ఉండకుండా విశ్రాంత గదులను ఏర్పాటు చేయడం సహా మొత్తం 14 అంశాలపై తీర్మానాలు చేశారు.

# మంచిర్యాలలో ఘోర రోడ్డు ప్రమాదం

మంచిర్యాల : మంచిర్యాల జిల్లా మేడారం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ నుంచి నిజామాబాద్ కు కుటుంబంతో కారులో వెళ్తున్నవారు, మేడారం ఐఓసీ పెట్రోల్ పంపు వద్ద గేదెలను రోడ్డు దాటించేందుకు ప్రయత్నిస్తున్న కాపరిని, గేదెను ఢీకొట్టారు. కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్నవారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.

# కేటీపీపీలో భారీ అగ్నిప్రమాదం

భూపాలపల్లి : జిల్లాలోని చెల్పూర్ కేటీపీపీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్ ఆవరణలో నిల్వ ఉంచిన రిజెక్ట్ కోల్ (బొగ్గు చూర) ఒక్కసారిగా అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. వేసవి తీవ్రత కారణంగా ఎండ వేడికి బొగ్గు నిల్వల్లో మంటలు పుట్టినట్లు తెలుస్తోంది. గాలి ప్రభావంతో మంటలు వేగంగా వ్యాపించి, ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. కిలోమీటర్ల మేర నల్లని పొగ మేఘాలు కనిపిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్లాంట్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే చర్యలు చేపట్టారు.

# గుడిసెలోకి దూసుకెళ్లిన కారు.. తప్పిన పెను ప్రమాదం

చిలకలూరిపేట : చిలకలూరిపేట పొలిరెడ్డిపాలెం వద్ద రాత్రి ఒక గుడిసెలోకి కారు దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఒక కారు అతివేగంతో అదుపుతప్పి గుడిసెలోకి దూసుకెళ్లింది. సమయానికి అందులో మనుషులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కారులో ఉన్న మనుషులు కారు ని అక్కడ వదిలిపెట్టి పరారయ్యారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏడీఈ

**రూ.10 లక్షల బిల్లు పాస్ చేసేందుకు రూ.30 వేల డిమాండ్**

నల్గొండ : విద్యుత్ లైన్ల మరమ్మతులకు సంబంధించిన బిల్లును మంజూరు చేసేందుకు లంచం ఆశించిన నల్గొండ జిల్లా దేవరకొండ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) సిరికొండ సైదులు ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. కంబాలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో అక్టోబర్ 2025లో వీచిన గాలివానకు దెబ్బతిన్న 33/11 కేవీ విద్యుత్ లైన్లను ఓ వ్యక్తి పునరుద్ధరించాడు. ఇందుకు సంబంధించిన రూ.10 లక్షల బిల్లును ప్రాసెస్ చేసి పై అధికారులకు పంపేందుకు సదరు ఏడీఈ రూ.30 వేలు డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, ఏప్రిల్ 16న తన కార్యాలయంలో లంచం డబ్బులు తీసుకుంటుండగా సైదులును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని, అతని వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# సమస్యల పరిష్కారానికి గ్రామాలకే వస్తా

**- రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**- లిధర్మారం మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చర్యలు**

**- ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

పెద్దపల్లి,ఏప్రిల్ 18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ప్రజల సమస్యలను పరిష్కరించడానికి గ్రామాలకే స్వయంగా వస్తానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.శనివారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో సుమారు రూ.2 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి అట్లూరు లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి శంకుస్థాపన చేసి,ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మారం మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు.గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు.విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు ఎర్రగుంటపల్లిలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు.ధర్మారం మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల పాఠశాలను పదవ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసి,75 శాతం ట్రైబల్ విద్యార్థులకు,25 శాతం ఇతర వర్గాలకు సీట్లు కేటాయిస్తామని తెలిపారు.మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చర్యలు



తీసుకుంటున్నామని,ఇది యువతకు క్రీడల్లో ప్రోత్సాహం కలిగిస్తుందని మంత్రి పేర్కొన్నారు.పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా వారంలో మూడు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటిస్తూ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.మొక్కజొన్న రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,అవసరమైతే ధర్మారం మండల కేంద్రంలో కూడా మక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

**48 గంటల్లోనే ధాన్యం డబ్బుల చెల్లింపు**

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

మండలంలోని 61మంది రైతులకు రూ.18.24 లక్షల సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.ధర్మారం మార్కెట్ కమిటీ పరిధిలో సుమారు రూ.2 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా కార్మికుల కొరత ఉండడంతో లోడింగ్ వేగం కొంత తగ్గే అవకాశం ఉందని,రైతులు సహకరించాలని కోరారు.నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి,48 గంటల్లో చెల్లింపులు జరిపే విధంగా చర్యలు తీసుకుంటున్నామని,రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అనంతరం మండలంలోని 61 మంది రైతులకు రూ.18.24 లక్షల విలువైన వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు.అలాగే 23 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులు, ఒకరికి షాదీ ముబారక్ చెక్కు,పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్ లా నాయక్,అదనపు కలెక్టర్ వేణు,డి.సి.ఓ. శ్రీమాల,జిల్లా పౌర సరఫరాల శాఖ శ్రీనాథ్,సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్,
ఏప్రిల్ 18,(ప్రజా కలం)

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు,గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో




షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ గురుకులాలలో, విద్యాలయాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, విద్య విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని, వసతి గృహాలలో మరమ్మత్తు పనులను చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వసతులపై చర్చించాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు.వీసీ అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలో సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సంక్షేమ శాఖల అధికారులు, ప్రాంతీయ సమన్వయ కర్తలు, మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు వారోత్సవాలను పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె. శ్రీనివాస్, పిడి డి ఆర్ డి ఏ శ్రీలత, సిపిఓ సౌమ్య, డిపిఓ సురేష్ మోహన్, డీఈఓ సుశీందర్ రావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు కేషు రామ్, రామేశ్వరీ దేవి, నవీన్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాలల జనాభా గణాంకాలను సరిదిద్దాలి: కరికే శ్రీనివాస్.

సిద్దిపేట ప్రజాకలం, ఏప్రిల్ 18.

రాష్ట్రంలో మాలల జనాభాను కావాలనే తక్కువగా చూపిస్తూ వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడానికి కుట్రలు జరుగుతున్నాయని మాలల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరికే శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఎస్సీల వర్గీకరణ ద్వారా మాలలకు విద్యా, ఉపాధి అవకాశాల్లో అన్యాయం జరిగిందని, తాజాగా విడుదల చేసిన కుల గణన సర్వేలో కూడా వివక్ష స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. 2011 జనాభా లెక్కలలో 17 లక్షలకు పైగా ఉన్న మాలల సంఖ్య తాజా సర్వేలో 14 లక్షలకు పడిపోవడం వెనుక ప్రభుత్వం ఉద్దేశపూర్వక వైఖరి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. మాల ఉపకులాలను విడదీసి లెక్కించడం ద్వారా అసలు జనాభాను తగ్గించి చూపే ప్రయత్నం జరిగిందన్నారు. నేతకాని, మాలసాలే, మాల బైండ్ల వంటి ఉపకులాలను వేరు చేసి ఇతర గ్రూపుల్లో చేర్చడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.



ఈ సర్వే శాస్త్రీయంగా జరగలేదని, వెంటనే రీసర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మాలల జనాభా నాల్గవ స్థానంలో ఉండాల్సి ఉండగా తాజా గణనలో ఏడవ స్థానానికి పడిపోయిందని, ఇది సరైన గణాంకం కాదన్నారు. రెడ్డి, గౌడ్ కులాల కంటే మాలల సంఖ్య తక్కువగా చూపించడం వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులతో కొంతమంది మాలలు అభివృద్ధి సాధిస్తే అగ్రవర్ణాలు సహించలేకపోతున్నాయని, ఇంకా మెజార్టీ మాలలు వెనుకబడి అంటరానితనాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఈ అంశంపై స్పందించకపోవడం బాధాకరమని, మాల సమాజానికి జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించలేని వారు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాల విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు మేల్కొని పోరాడాలని పిలుపునిచ్చారు. మాలల జనాభా గణాంకాలను సరిదిద్దకపోతే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని కరికే శ్రీనివాస్ హెచ్చరించారు.



## పెద్ద చీకోడ్ విద్యార్థుల కరాటే ప్రతిభకు గుర్తింపు

సిద్దిపేట ప్రజాకలం ఏప్రిల్ 18.

నేటి సమాజంలో బాలికలకు ఆత్మరక్షణ విద్యగా కరాటే ఎంతో అవసరమని యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్, సుశాంక్ వర్ధన్, హర్షవర్ధన్ మరియు పీటీఈ శ్రీనివాస్ గౌడ్ పరిశీలకులుగా వ్యవహరించారు. దుబ్బాక మండలం నుంచి సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొనగా, 23 మంది విజేతలుగా నిలిచి బెల్ట్స్, సర్టిఫికెట్లు సొంతం చేసుకున్నారు.

యెల్లో బెల్ట్స్‌లో భార్గవి, మానస, సిరి, అనుదీప్తి, అన్వేష్, సాత్విక్, ఆదర్శ్, విష్ణుకాంత్, చార్విక్ విజేతలుగా నిలిచారు. ఆరెంజ్ బెల్ట్స్‌లో శ్రీమాన్, అపూర్వ, ప్రద్యుమ్న, హరిదీప్ సాయి, సాత్విక్, వర్షిత్ సాయి కృష్ణ, రూపేష్ విజయం సాధించారు. గ్రీన్ బెల్ట్స్‌లో వర్ష, శరణ్య, యగ్నేశ్, హన్విక ప్రియ, మనుభరద్వజ్ విజేతలుగా నిలిచారు. బ్లూ బెల్ట్‌లో అశ్విన్ విజయం సాధించాడు. విజేతలను కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ అభినందించారు.

## వేలూరు వెంకట్ రెడ్డి కుటుంబాన్నీ పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు.

గజ్వేల్ నియోజకవర్గం:18 ఏప్రిల్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండల్ లోని వర్గల్ మండల పార్టీ ప్రెసిడెంట్ వేలూరు వెంకట్ రెడ్డి నాయనమ్మ చంద్రమ్మ గత 2 క్రితం అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ సందర్భంగా శనివారం ఏఎంసి మాజీ చైర్మన్ మదాసు శ్రీనివాస్,ఎంపిటిసిల రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, బిఆర్ఎస్ మర్కూక్ మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి,లక్ష్మణ్ రాజు లు కలిసి ఆమె కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతితో పాటు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి వెంట బిఆర్ఎస్ సీనియర్ నేతలు మేకల కనకయ్య, రమేష్ గౌడ్,సందీప్ రెడ్డి,తదితరులు ఉన్నారు.



## ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించిన సీఐ రవి కుమార్




గజ్వేల్ :18 ఏప్రిల్
( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్‌లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించేందుకు పోలీసులు వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యంగా"అరైవ్ అలైవ్'' కార్యక్రమంలో భాగంగా శనివారం "జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే"గా పాటించారు.సాధారణంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించడం జరుగుతుంటుంది.అయితే ఈ ప్రత్యేక కార్యక్రమంలో పోలీసులు భిన్నంగా స్పందించారు.నిబంధనలు పాటించని వారిని ఆపి,వారికి చలాన్లు విధించకుండా,వారు చేసిన తప్పు వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు. అలాగే ఆ ఉల్లంఘనకు సాధారణంగా ఎంత జరిమానా విధిస్తారో తెలియజేశారు. గజ్వేల్ ప్రాంతం సహా ప్రధాన రహదారులపై తనిఖీలు నిర్వహించిన పోలీసులు, వాహనదారులతో మృదువుగా మాట్లాడి భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి గులాబీ దండలు వేసి, ఇకపై ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలలో భయంతో కాకుండా బాధ్యతతో ట్రాఫిక్ నియమాలు పాటించేలా మార్పు తీసుకురావడమే లక్ష్యమని పోలీసులు తెలిపారు. జరిమానాలు విధించడం కన్నా, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యానికి చేరుకోవడం ముఖ్యమనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ జరిమానాలు విధించడం ఒక్కటే పరిష్కారం కాదు. ప్రజల్లో అవగాహన పెంపొందిస్తేనే ప్రమాదాలు తగ్గుతాయి. అందుకే ఈ విధంగా'జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే'నిర్వహించాము" అని తెలిపారు.



## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం



గజ్వేల్ :18 ఏప్రిల్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

మహిళా రిజర్వేషన్ల బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ శనివారం గజ్వేల్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. మహిళా సాధికారతకు అడ్డుపడే పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ గజ్వేల్ మండల బిజెపి అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ మహిళా మోర్చా నాయకురాలు ఆలేటి సుమతి,చిలువేరి కుంకుమ రాణి మాట్లాడుతూ మహిళా సాధికారతకు అడ్డుపడే పార్టీలకు ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించడం జరిగింది బయట మహిళా హక్కులంటూ రాహుల్ గాంధీ ప్రగల్భాలు. చట్టసభల్లో మాత్రం మహిళా రిజర్వేషన్లను అడ్డుకునే కుతంత్రాలు కాంగ్రెస్ లోక్‌సభలో అడ్డుకున్నది కేవలం మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును మాత్రమే కాదు వారు అడ్డుకున్నది మహిళల ప్రగతిని మహిళల రాజకీయ సాధికారతను దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో సమతుల్యత లభించి అందరికీ న్యాయం జరిగే అవకాశాన్ని కాంగ్రెస్ పార్టీ దూరం చేసింది. సమతుల్య సహృద్భావ వాతావరణాన్ని కలుషితం చేసి రాజకీయ ప్రయోజనాలు పొందాలనే కుటిల నీతిలో భాగమే ఈ చర్య. మహిళ నాయకత్వాన్ని అంగీకరించలేని అహంకారపూరిత కాంగ్రెస్ వైఖరిని ఈ దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరు. ఈ కార్యక్రమంలో దాతర్ పల్లి సర్పంచ్ బాసు రాజు సిద్దిపేట జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యులు వెంకటరెడ్డి పట్టణ మండల ప్రధాన కార్యదర్శిలు నాయిని సందీప్ కుమార్,మడుగురి నరసింహ, ఇప్ప స్వామి,పట్టణ మహిళా మోర్చా కార్యదర్శి సరిత,మహిళా నాయకురాలు స్వరాజ్య లక్ష్మి మండల పట్టణ నాయకులు బాచిని శివప్రసాద్, కర్నాల శ్రీనివాస్,రాజశేఖర్ రెడ్డి,సంద అశోక్,పవన్ కుమార్,అరవింద్ రెడ్డి, గణేష్ మహేందర్ స్వామి,మల్లేశం, నర్సింలు,తదితరులు పాల్గొన్నారు

## రాయపోల్‌లో దరువు జాతర వాల్ పోస్టర్ ఆవిష్కరణ.

సిద్దిపేట ప్రజాకలం ఏప్రిల్ 18.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో ఈనెల 20న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరగనున్న 25 సంవత్సరాల దరువు జాతర



కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దరువు జాతర సాంస్కృతిక రంగానికి ప్రతిష్టాత్మక వేదికగా నిలుస్తోందని, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగన్నగారి రవీందర్ రెడ్డి, కళాకారుడు తుడుం స్వామి, మాసంపల్లి కనకయ్య, మాసంపల్లి యాదగిరి, సంఘం నరేష్, గుని ప్రభాకర్, గుని కుమార్, ఇంద్రకరణ్ లక్ష్మణ్, హుస్నేనగల్ల ఎల్లం, విజయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ ఓఆర్ఎస్ పంపిణీ

సిద్దిపేట ప్రజాకలం ఏప్రిల్ 18.

మండలంలోని మాచిన్‌పల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు త్రాగునీటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ బొక్కల నాగరాజు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కూలీల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా వాటర్ క్యాన్లతో పాటు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పని స్థలాల్లో కూలీలు డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు ఈ చర్యలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. గ్రామపంచాయతీ తరఫున కూలీలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలు




కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కవిత, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తోపాటు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జాలిగామ లో బాలికలకు క్యాన్సర్ నివారణ కోసం టీకాలు

గజ్వేల్ :18 ఏప్రిల్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో బాలికల ఆరోగ్య రక్షణకు ముఖ్యమైన కార్యక్రమం నిర్వహించారు,14 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలకు సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో టీకాలు వేయించారు,ఈ కార్యక్రమంలో జాలిగామ గ్రామ మాజీ ఎంపీటీసీ తాళ్ల ఆంజనేయులు గౌడ్ పాల్గొని బాలికలకు అవగాహన కల్పించారు,ఆశా వర్కర్ అరుంధతి, గ్రామ మహిళా గ్రూప్ అధ్యక్షురాలు సులోచన కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు,బాలికలు హాజరై టీకాలు తీసుకున్నారు,ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే నివారించడానికి టీకాలు ఎంతో అవసరమని తెలిపారు....



# సచివాలయంలో మంత్రి గడ్డం వివేక్ ని కలిసిన కాట శ్రీనివాస్ గౌడ్

## అభివృద్ధి పనులు ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ

పటాన్ చేరు ఏప్రిల్ 18 (ప్రజా కలం) ప్రతినిధి

తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర కార్మిక ఉపాధి శిక్షణ కర్మాగారాలు గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖల మంత్రివర్యులు



గడ్డం వివేక్ వెంకటస్వామి ని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా పటాన్‌చెరు మండలానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు ముఖ్యంగా స్థానిక మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు ఇతర ప్రజా సమస్యలపై చర్చించారు ఈ సమస్యల పరిష్కాకి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

# రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దు

**-స్ఫూర్తి ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రెటరీ దానప్ప గారి చంద్రశేఖర్**

మహేశ్వరం, ఏప్రిల్ 18,(ప్రజా కలం)

ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్ఫూర్తి ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రెటరీ దానప్ప గారి చంద్రశేఖర్ అన్నారు. స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రోడ్లపై చెత్త వేయవద్దని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ నివారణ ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. నివేం మనిషివి రోడ్లపై చెత్త వేసే చెత్త మనివి పాట పూర్తిగా విని యూట్యూబ్ ఛానల్ సబ్స్క్రయిబ్ చేసి లైక్ చేసి షేర్ చేస్తారని స్ఫూర్తి ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రెటరీ దానప్ప గారి చంద్రశేఖర్ కోరారు. మన పరిసరాలలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మనం చెత్త ఎక్కడపడితే అక్కడ వేస్తే అది మన ప్రాణాలకే ప్రమాదకరంగా మారుతుందని చెత్త వేయడం కలుషితం ఏర్పడి దోమలు,ఈగల వల్ల లేనిపోని రోగాలు వస్తాయని అందుకే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చంద్రశేఖర్ కోరారు.



# ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి..

## గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి.

## జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య.

సిద్దిపేట ప్రజాకలం ఏప్రిల్ 18: ప్రతి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ కూలీల సంఖ్యను 100 మందికి పెంచేలా తగిన పనులను గుర్తించి చేపట్టాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య సూచించారు. శనివారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో



నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని, పనులు పూర్తి చేసిన కూలీలకు బిల్లులు వెంటనే అందేలా కృషి చేయాలని సూచించారు. ఉపాధి కూలీల సంఖ్యను మరింత పెంచేందుకు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ చేసి డంపింగ్ షెడ్‌కు తరలించాలని తెలిపారు. అలాగే మురుగు నీటి కాలువలను పరిశుభ్రంగా ఉంచి, వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీఓ జనార్ధన్, ఎంపీఓ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.





# రావిరాల పెద్ద చెరువులో ప్రమాదకరంగా విస్తరిస్తున్న గుర్రపు డెక్క

- గుర్రపు డెక్క (నీటి నాచు) విపరీతంగా పెరగడం వల్లమత్స్య కార్మికులుఅనేక ఇబ్బందులు
- గుర్రపు డెక్క పెరుగుదల పట్ల మత్స్యకారులు తీవ్ర ఆందోళన
- గుర్రపు డెక్కను తొలగించాలని అధికారులకు, నాయకులకు విన్నవించినా ఫలితం శూన్యం
- గతంలో ఈ గుర్రపు డెక్కను తొలగిస్తామని కేఎల్ఆర్ మత్స్యకారులకు హామీ
- కె ఎల్ ఆర్ హామీ ఇచ్చిన ఫలితం శూన్యం -తక్షణమే గుర్రపు డెక్క ఎక్కడ తొలగించాలి
- రావిరాల గంగపుత్రుల సంఘం నాయకుడు గుంటి గణేష్



మహేశ్వరం, ఏప్రిల్ 18,(ప్రజా కలం)

రావిరాల పెద్ద చెరువులో ప్రమాదకరంగా గుర్రపు డెక్క విస్తరిస్తున్న పట్టించుకునే నాధుడే లేకుండా పోయాడని రావిరాల గంగపుత్రుల సంఘం నాయకుడు గుంటి గణేష్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ రావిరాల పెద్ద చెరువులో రోజురోజుకూ గుర్రపు డెక్క (నీటి నాచు వంటి మొక్కలు) విపరీతంగా పెరిగిపోతోందని ఆయన అన్నారు. హొదీనివల్ల చేపలు చనిపోయే ప్రమాదం ఉందని, చేపల వేట కూడా కష్టతరంగా మారుతోందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది వారి జీవనోపాధిని దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినప్పుడు గుర్రపు డెక్కను తొలగిస్తామని కె ఎల్ ఆర్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేఎల్ఆర్ కూడా దీనిపై సానుకూలంగా స్పందించారు. హొహామీలు ఇచ్చి నెలలు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని మత్స్యకారులు వాపోతున్నారు. తక్షణమే స్పందించి రావిరాల పెద్ద చెరువులోని గుర్రపు డెక్కను తొలగించి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. కాంగ్రెస్ ఇంచార్జ్ కె ఎల్ ఆర్ అందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# విలేకరులకు హెల్మెట్ పంపిణీ,

## - సమాజంలో విలేకరుల పాత్ర చాలా గొప్పది... వట్ పల్లి ఎస్సై లవ కుమార్.




సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 18( ప్రజాకలం):

"ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం విలేకరులకు సంగారెడ్డి హోప్ న్యూరో హాస్పిటల్ వైద్యుడు కృష్ణమూర్తి సహకారంతో విలేకరులకు ఎస్సై లవకుమార్ ఆధ్వర్యంలో హెల్మెట్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించినప్పుడే మనతో పాటు మన కుటుంబం సురక్షితంగా ఉంటుందని ఎక్కడైనా పాత్రికేయుల పాత్ర చాలా గొప్పదని వారు ప్రతి రోజు నిత్యం వార్తలు సేకరిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారదులుగా పనిచేస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు వార్తలు కవర్ చేస్తారని అన్నారు .వాహనాలు నడిపేటప్పుడు పూర్తి ఏకాగ్రతతో ఉండాలని సూచించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ గురించి వివరిస్తూ, డ్రైవర్ ముందుగా తన వాహనం పరిస్థితి గురించి తెలుసుకుని ఉండాలని వాహనాన్ని ఎంత వేగంగా నడపడం కాకుండా ఆ వేగాన్ని నియంత్రించగలగడం ముఖ్యమని అన్నారు. అజాగ్రత్తగా వాహనం నడపడం ప్రమాదాలకు దారి తీస్తుందని అన్నారు.

పత్రిక విలేఖరులకు 30 హెల్మెట్లు పంపిణీ చేశారు . హెల్మెట్ ధరించడం మరియు ట్రాఫిక్ నియమాలను పాటించడం పై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో ఎస్సై శ్రీహరి, ఏఎస్ఐ రషీద్ అలీ, హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, బస్వరాజ్ పోలీస్ సిబ్బంది మండల విలేకరులు మల్లేశం,షఫీ, దాసు ప్రభాకర్ సింహ రెడ్డి నర్సింలు తదితరులు ఉన్నారు.

# భూగర్భ తవ్వకాలు జరిపే ముందు సిబియుడి యాప్ లో రిజిస్టర్ చేసుకోవాలి -జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్ ఏప్రిల్ 18(ప్రజాకలం ప్రతినిధి) సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం విద్యుత్, నీటిపారుదల, టెలికాం), టి ఫైబర్ ,గ్రామపంచాయతీ, ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ అటవీ ,ఇంట్రా గ్రిడ్ అధికారులతో నుంచి భూగర్భ ఆస్తులకు నష్టం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖలకు అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిబియుడి యాప్ ఈ యాప్‌ను భారత ప్రభుత్వం (డిఓపి ) రూపొందించింది.

దీని ప్రధాన లక్ష్యం డిగ్గింగ్ (తవ్వకం) సమయంలో భూగర్భ లైన్లు దెబ్బతినకుండా కాపాడటం. తవ్వకం ముందు సమాచారం ఇవ్వడం ఎక్కడ తవ్వకం చేయబోతున్నారో ముందుగా యాప్ లో నమోదు చేయవచ్చు అని వారు తెలిపారు. భూగర్భ సదుపాయాల వివరాలు తెలుసుకోవడం ద్వారా ఆ ప్రాంతంలో ఉన్న ఫైబర్ కేబుల్స్,గ్యాస్ పైపులు,నీటి లైన్లు ,వంటి వివరాలు తెలుసుకోవచ్చు అని అన్నారు. భూగర్భ ఆస్తులకు (పైప్‌లైన్‌లు, కేబుల్స్, పునాదులు) నష్టం కలగకుండా తవ్వకాలు జరపడం చాలా ముఖ్యమని దీనికోసం తవ్వకాలకు ముందేహొభూగర్భ యుటిలిటీ మ్యాపింగ్‌హొ(జీపీఆర్ వంటి సాంకేతికతతో) ఉపయోగించి, అధికారులు, సంబంధిత సంస్థల అనుమతులు తీసుకోవాలన్నారు. మానవీయ పద్ధతిలో జాగ్రత్తగా తవ్వడం, నిపుణుల పర్యవేక్షణ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం తప్పనిసరిగా వివరించారు. భూగర్భ ఆస్తుల రక్షణకు తీసుకోవాల్సిన ముఖ్యమైన చర్యలపై తవ్వకం చేపట్టే ప్రదేశంలో ఉన్న భూగర్భ కేబుల్స్, పైపులైన్ల సమాచారాన్ని (జీపీఆర్ ఉపయోగించి ముందుగానే గుర్తించాలన్నారు. అనుమతులపై సంబంధిత ప్రభుత్వ శాఖలు (విద్యుత్, నీటిపారుదల, టెలికాం) నుంచి అనుమతులు మ్యాప్‌లను సేకరించుకోవాలని వారు సూచించారు. యంత్రాలను (జేసీబీ ) వాడే ముందు భూగర్భ వస్తువులున్నట్లు అనుమానం ఉన్న చోట చేతితో (మనుషులతో) జాగ్రత్తగా తవ్వాలని వారు సూచించారు.

నిపుణులైన ఇంజనీర్ల పర్యవేక్షణలో మాత్రమే ఇటువంటి పనులు జరగాలని వారు తెలిపారు. అప్రమత్తతలో భాగంగా తవ్వకం ప్రదేశంలో హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. తవ్వకాలు జరిపేటప్పుడు చట్టపరమైన నిబంధనలను పాటించడం, ప్రజల భద్రతను (ప్రభుత్వ ఆస్తులతో సహా)కాపాడడం మన కర్తవ్యం అని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డి పి వో యాదయ్య, జిల్లా అటవీ అధికారి జోజీ ,.ఈ.డి.యం సందీప్ టి ఫైబర్ మేనేజర్ ఈశ్వర్, టి ఫైబర్ డి ఈ అవినాష్, టి ఫైబర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామ్, మిషన్ భగీరథ అధికారి సంపత్, గ్రిడ్ అధికారి నాగభూషణం, ఈ ఈ పి ఆర్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.






# ప్రతి ప్రయాణం సురక్షితం కావాలి

## మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు

మెదక్ ఏప్రిల్ 18(ప్రజాకలం ప్రతినిధి) రోడ్డు ప్రమాదాల నివారణకు మెదక్ జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు ప్రారంభించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రచార రథాన్ని కొబ్బరికాయ కొట్టి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభించిన చైతన్య రథం జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించనుందని, ముఖ్యంగా జనసంచారం అధికంగా ఉండే జంక్షన్‌లు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారని, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, జీబ్రా క్రాసింగ్ వద్ద రోడ్డు దాటడం, వాహనాల మధ్య సురక్షిత దూరం పాటించడం, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం వంటి అంశాలపై ప్రజలకు వివరణ ఇవ్వనున్నారు. అదే సమయంలో సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణం, ఓవర్‌లోడింగ్ వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం ఒక కుటుంబాన్ని పూర్తిగా కూదుపేసే ప్రమాదమని పేర్కొన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం ప్రాణరక్షణకు అత్యవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. అవగాహనతో పాటు నియమాల అమలులో ఎలాంటి రాజీ ఉండదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎఆర్ డియస్పి రంగానాథ్, సీఐ లు మహేష్, జర్జ్, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, ఆర్ఐ లు శైలందర్, రామకృష్ణ, ఎసై లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏప్రిల్ 20 నుంచి 26 వరకు జిల్లాలో సంక్షేమ వారం కార్యక్రమాలు.

సిద్ధిపేట ప్రజాకలం ఏప్రిల్ 18.

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు తీరుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.




ఈ సందర్భంగా ఏప్రిల్ 20 నుంచి 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా "వెల్ఫేర్ వీక్" నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20న విద్యాసంస్థల్లో శుభ్రత కార్యక్రమాలు, 21న విద్యార్థులకు టాలెంట్ ఫెస్ట్, 22న హాస్టళ్లు, పాఠశాలల మరమ్మతుల పనుల అంచనాలు, 23న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు, 24న యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, 25న సమ్మర్ క్యాంపులు, 26న రాష్ట్రవ్యాప్తంగా "బడి బాట" కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు. జిల్లా కలెక్టర్ కె. హేమావతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి 26 వరకు జిల్లావ్యాప్తంగా సంక్షేమ వారం థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) అబ్దుల్ హమీద్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్ సుర్ణ గంటి అర్జున్‌కు మాతృవియోగం

## ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శ్రద్ధాంజలి

మహేశ్వరం, ఏప్రిల్ 18, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ మాజీ సర్పంచ్,



మాజీ కార్పొరేటర్ సుర్ణ గంటి అర్జున్ తల్లి సుర్ణ గంటి నరసమ్మ పరమపదించిన విషయం తెలిసి మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి బడంగ్పేట్ స్మశాన వాటికకు వెల్లి ఆమె భౌతిక దేహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అర్జున్ గారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బడంగ్పేట్ ప్రాంతానికి చెందిన పలువురు మాజీ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## రైతులకు న్యాయం చేయాలని ఫ్యాబ్ సిటీలో దీక్ష చేపట్టిన ఫ్యాబ్ సిటీ భూ నిర్వాసిత రైతులు

### సిపిఐ(ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

మహేశ్వరం, ఏప్రిల్ 18,(ప్రజా కలం)

రైతులకు న్యాయం చేయాలని ఫ్యాబ్ సిటిలో రైతులు ఇవాళ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ(ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఏండ్లు గడుస్తున్న రైతులకు



నష్టపరిహారం చెల్లించకపోవడం పై ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే సబితఇంద్రారెడ్డి పై విరుచుకుపడ్డారు. 2004లో భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటి వరకు ఎటువంటి పరిహారం చెల్లించలేదని అన్నారు. రైతులకు నష్టరిహారం కింద కేటాయించిన ఇళ్ళ స్థలాలు కోర్టు కేసులో ఉన్నందున వేరే ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించి రిజిస్ట్రేషన్ల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రావిర్యాల జాన్నాయిగూడ గ్రామస్థుల నుండి పేద మధ్యతరగతి రైతుల నుండి మొత్తంగా 827 ఎకరాల ప్రభుత్వం ఫ్యాబ్ సిటి పరిశ్రమల కొరకు సేకరించింది దీనికి గాను కనీసం 40 ఎకరాలు కేటాయించి ప్లాట్లు చేసి నష్టపరిహారంగా ఇవ్వడానికి ప్రభుత్వం మరియు అధికారులు సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారు కానీ కంపెనీలకు మాత్రం ఎలాంటి కోర్టు సమస్యలు అడ్డు రావడం లేదా అని వారు ప్రశ్నించారు వెంటనే అధికార యంత్రాంగం స్పందించి రైతులకు ప్రత్యామ్నాయ స్థలంలో ప్లాట్లు కేటాయించి రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నాము లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని తెలియజేశారు.సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కాడిగల్ల భాస్కర్, సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రావుల జంగయ్య, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముసలయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కరత్, సిపిఐ ఎం మహేశ్వరం మండల కార్యదర్శి శేఖర్, సిపిఐ ఎం మహేశ్వర్ మండల కమిటీ సభ్యులు పి జగన్ గోదాసు నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నిర్ణయమే ఫైనల్

### అమీన్పూర్ ఎస్టిపిని తరలిస్తాం లేదా రద్దు.. అవసరమైతే ముఖ్యమంత్రితో సైతం చర్చిస్తాము


### ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు పై ఎమ్మెల్యే జిఎంఆర్..

పటాన్ చేరు ఏప్రిల్ 18 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్చెరు ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా అమీన్పూర్ లో ఏర్పాటు చేయదలచిన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టిపి ) ను తరలించడం లేదా రద్దు చేయడం జరుగుతుందని.. ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం అమీన్పూర్ డివిజన్ పరిధిలోని 993 సర్వే నంబర్లో ఎస్ టి పి ఏర్పాటు చేయనున్న స్థలంలో శనివారం ఆయా కాలనీల ప్రజలతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ పరిధిలోని మురుగు నీటి జలాలను శుద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా తమకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని స్థానిక కాలనీల ప్రజల నుండి పెద్ద ఎత్తున అభ్యంతరాలు తలెత్తుతున్న నేపథ్యంలో.. మెజార్టీ ప్రజలు స్థానిక మాజీ ప్రజాప్రతినిధుల అభిప్రాయానికి అనుగుణంగా ఎస్టిపిని తరలించడం లేదా రద్దు చేసేందుకు ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిపారు అవసరమైన పక్షంలో ముఖ్యమంత్రి దృష్టికి సైతం తీసుకుని వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అమీన్పూర్ లో ఎస్టీపీని ఏర్పాటు చేయడం జరగదని స్పష్టం చేశారు. అత్యంత అవసరమైతే ప్రత్యేక పైపులైను ఏర్పాటు చేసి నక్కవాగులోకి తరలించడం జరుగుతుందని తెలిపారు. పనులను వెంటనే నిలిపివేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ప్లాంట్ ఏర్పాటుపై రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు ఈ సమావేశంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, జలమండలి సిజిఎం పద్మజ, జిఎం సుబ్బారాయుడు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.



## ఆందోల్ లో మంత్రి దామోదర్ రాజనర్సింహ సుడిగాలి పర్యటన.

### - అందోల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం.



సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 18( ప్రజా కలం)

జోగిపేట పాలిటెక్నిక్ కాలేజీలో సుమారు 75 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన శనివారం ఆందోల్ నియోజకవర్గం లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటన లో బాగంగా చౌటకూర్ మండలం శివంపేట్,జోగిపేట పాలిటెక్నిక్ కళాశాలలో న్యూలాండ్ ఫౌండేషన్ సీఎస్ఆర్ రూ.43 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన మెకానికల్ వర్క్షాప్ షెడ్ను మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. పాలిటెక్నిక్ కాలేజీలో డి ఎం ఎఫ్.టి 6లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన హిమస్ట్ ఎల్. ఈ.డి 4 స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు. అనంతరం 26 లక్షల రూపాయలతో తోషిబా కంపెనీ సి ఎస్ ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...జోగిపేట పాలిటెక్నిక్ కాలేజీ కి ఇప్పటివరకు 2 కోట్ల 35 లక్షల 75 వేల రూపాయల సీఎస్ఆర్ నిధులను వెచ్చించి పలు అభివృద్ధి పనులను చేపట్టమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య , వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ అభివృద్ధిపై కాలేజీ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం లో పాల్గొన్నారు. పాలిటెక్నిక్ కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పాలిటెక్నిక్ కాలేజీలో గర్ల్స్ హాస్టల్ నిర్మాణానికి, ఇతర విభాగాల వర్క్ షెడ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, అదనపు కలెక్టర్ పాండు, సర్పంచ్ సంధ్యారాణి, న్యూ ల్యాండ్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ డివి రెడ్డి, ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## తమిళనాడు ఎన్నికల విధులకు సంగారెడ్డి పోలీసులు.

### -తమిళనాడు సాధారణ ఎన్నికల బందోబస్తు విధులకు హాజరౌతున్న హోమ్ గార్డ్ సిబ్బందికి మెడికల్ మరియు కనీస అవసరాల కిట్లు పంపిణీ.

### -విధుల్లో ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి, సంగారెడ్డి జిల్లా కు మంచి పేరు తీసుకురావాలని సూచన... జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్,



సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 18 (ప్రజా కలం): తమిళనాడు రాష్ట్రంలో జరుగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు విధులకు సంగారెడ్డి జిల్లా నుండి వెళుతున్న 38 మంది హోమ్ గార్డ్ సిబ్బందికి జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ మెడికల్ మరియు కనీస అవసరాల కిట్లను అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. దూర ప్రాంతాలలో విధులు నిర్వహించేందు వెళుతున్న సిబ్బంది బాగోగులను దృష్టిలో ఉంచుకొని, అవసరమైన ప్రాథమిక ఔషధాలు, బిస్కెట్స్, వ్యక్తిగత అవసరాల సామగ్రి అందుబాటులో ఉండేలా ఈ కిట్లు అందజేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అలాగే విధుల్లో అప్రమత్తంగా ఉండి, ఎలాంటి పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, సంగారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలున్న నేరుగా సంగారెడ్డి జిల్లా పోలీసు డ్యూటి డాక్టర్ కు కాల్ చేసి, మెడిసిన్స్ వివరాలను తెలుకోవచ్చు అన్నారు. విధి నిర్వహణలో లేదా వ్యక్తిగత సమస్యలున్నా సంబంధిత అధికారుల ద్వారా నా దృష్టికి తీసుకురాలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఆర్ డిఎస్పీ నరేందర్, పోలీసు డ్యూటి డాక్టర్ జ్యోతి, డానియెల్ ఆర్ఐ హోమ్ గార్డ్స్, ఆర్ఐ లు సురేష్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రావ్, బందోబస్తు విధులకు వెళుతున్న ఆర్.ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలి

### - హెల్మెట్ ధరిస్తేనే ప్రాణాలకు రక్షణ
### - మహేశ్వరం మండల కేంద్రంలో ఎర్రివే అలివే' అవగాహన కార్యక్రమం
### - మహేశ్వరం స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాఘవేందర్ రెడ్డి
### - మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్

మహేశ్వరం, ఏప్రిల్ 18,(ప్రజా కలం)

ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని మహేశ్వరం స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాఘవేందర్ రెడ్డి అన్నారు. శనివారం నాడు మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో మహేశ్వరం వ్యాపార సముదాయ సంఘం అనుబంధ సంఘాల వారితో మహేశ్వరం సర్కిల్ ఇన్స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి. సబ్ ఇన్స్పెక్టర్ రాఘవేందర్ గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ రోడ్డు సురక్ష అభియాన్ రహదారి భద్రత అభియాన్ 2026 ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రత అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం గ్రామ దుకాణదారుల తో మహేశ్వరం మెయిన్ చౌరస్తాలో ఏర్పాటుతున్న ట్రాఫిక్ ఇబ్బంది ఫుట్ పాత్ దుకాణములు. దుకాణములలో సిసి కెమెరాలు బిగించడం. ఇతర రాష్ట్రాల నుండి వస్తున్న కూలీలతో అప్రమత్తంగా ఉండడం ఆన్లైన్ డబ్బులు సైబర్ మోసాల గురించి అప్రమత్తంగా ఉండాలని ఏమైనా లావాదేవీలలో అనుమానం వచ్చినప్పుడు 1930 కు సమాచారం ఇవ్వాలని పోలీసులు అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్. ఉప సర్పంచ్ జోరల రమేష్. గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లు టి0గరికారి బేబీ మక్కాజి. కాకి పరమేష్ ముదిరాజ్. ఆకుల వీరీ బాబు. మహేశ్వరం వ్యాపార సముదాయ సంఘం అధ్యక్షులు ఒగ్గు శ్రీశైలం. ఉపాధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ సలీం. మోలగశి మహేష్. శంకరి మహేందర్ జల్లెల శివకుమార్ . ప్రధాన కార్యదర్శి పులిపాటి శ్రీనివాస్. కార్యదర్శులు కాకి రాజేష్ ముదిరాజ్ . వేములకొండ ప్రసాద్ చారి.కోశాధికారి గాజుల శ్రీనివాస్. ఉప కోశాధికారి కడెమోని బాలయ్య. ప్రచార కార్యదర్శులు షేక్ హాజీ బాబా. పులిగిల్ల బాలా చారి. కార్యదర్శులు కాకి రాజేష్ ముదిరాజ్. ఫుడ్ యూనియన్ అధ్యక్షులు షేక్ అలీ. ఉపాధ్యక్షులు రమేష్. టైలర్ యూనియన్ అధ్యక్షులు తాళ్ల నాగలింగం.మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ అధ్యక్షులు డాక్టర్ పాండురంగయ్య. ప్రధాన కార్యదర్శి మోదిని శివప్రసాద్. బైక్ మెకానిక్ అండ్ ఆటోమొబైల్స్ యూనియన్ అధ్యక్షులు మంకాల రామచంద్రయ్య ముదిరాజ్. హెయిర్ సెలూన్ యూనియన్ అధ్యక్షులు దూసకంటి మైసమ్మ



రాజ్. వెల్డింగ్ షాప్స్ యూనియన్ అధ్యక్షులు పులిగిల్ల వెంకటేష్ చారి. ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షులు ఆకుల రాఘవేందర్. సభ్యులు షేక్ ఇస్మాయిల్ ఎలక్ట్రికల్స్ అండ్ హార్డ్వేర్ యూనియన్ అధ్యక్షులు ఆల్లె సుధాకర్ సభ్యులు షేక్ ఖాజా. భీమనపల్లి రాజేష్. మహమ్మద్ రిజ్వాన్ వర్తక సంఘం సభ్యులు భీమనపల్లి శ్రీనివాస్. పెద్దమ్మ వెంకటేష్. మొబైల్ షాప్ యూనియన్ సభ్యులు కౌకుంట్ల శేఖర్. కౌకుంట్ల శ్రీనివాస్. టర్న్ పంచర్ యూనియన్ అధ్యక్షులు గాండ్ల శేఖర్. సభ్యులు సేవాక్. మొహమ్మద్ ఖదీర్. మహమ్మద్ ఉస్మాన్ పాషా. వెల్డింగ్ షాప్ సభ్యులు సయ్యద్ బషారత్ అలీ. కిరాణా షాప్ సభ్యులు గడ్డమీది ఆనంద ప్రభాకర్. మంచుకొండ నవీన్. ప్రధాన కార్యదర్శి. సభ్యులు రమేష్. పెద్దమ్మ శ్రీనివాస్. మెకానిక్ అప్ప. వివిధ సంఘాల నాయకులు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా జరుపుకున్నారు.మహేశ్వరం వ్యాపార సముదాయ సంఘం ప్రచార కార్యదర్శి షేక్ హాజీ బాబా తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం

గజ్వేల్ :18 ఏప్రిల్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

మహిళా రిజర్వేషన్ల బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ శనివారం గజ్వేల్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. మహిళా సాధికారతకు అడ్డుపడే పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారు.ఈ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ గజ్వేల్ మండల బిజెపి అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ మహిళా మోర్చా నాయకురాలు ఆలేటి సుమతి,చిలువేరి కుంకుమ రాణి మాట్లాడుతూ మహిళా సాధికారతకు అడ్డుపడే పార్టీలకు ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించడం జరిగింది బయట మహిళా హక్కులంటూ రాహుల్ గాంధీ ప్రగల్భాలు.చట్టసభల్లో మాత్రం మహిళా రిజర్వేషన్లను అడ్డుకునే కుతంత్రాలు కాంగ్రెస్ లోక్సభలో అడ్డుకున్నది కేవలం మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును మాత్రమే కాదు వారు అడ్డుకున్నది మహిళల ప్రగతిని మహిళల రాజకీయ సాధికారతను దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో సమతుల్యత లభించి అందరికీ న్యాయం జరిగే అవకాశాన్ని కాంగ్రెస్ పార్టీ దూరం చేసింది. సమతుల్య సహృద్భావ వాతావరణాన్ని కలుషితం చేసి రాజకీయ ప్రయోజనాలు పొందాలనే కుటిల నీతిలో భాగమే ఈ చర్య. మహిళ నాయకత్వాన్ని అంగీకరించలేని అహంకారపూరిత కాంగ్రెస్ వైఖరిని ఈ దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరు.ఈ కార్యక్రమంలో దాతర్ పల్లి సర్పంచ్ బాసు రాజు సిద్దిపేట జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యులు వెంకటరెడ్డి పట్టణ మండల ప్రధాన కార్యదర్శిలు నాయిని సందీప్ కుమార్,మడుగురి నరసింహ, ఇప్ప స్వామి,పట్టణ మహిళా మోర్చా కార్యదర్శి సరిత,మహిళా నాయకురాలు స్వరాజ్య లక్ష్మి మండల పట్టణ నాయకులు బాచిని శివప్రసాద్, కర్నాల శ్రీనివాస్,రాజశేఖర్ రెడ్డి,సంద అశోక్,పవన్ కుమార్,అరవింద్ రెడ్డి, గణేష్ మహేందర్ స్వామి,మల్లేశం, నర్సింలు,తదితరులు పాల్గొన్నారు



## వేములవాడలో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్

### -- పట్టణ అభివృద్ధికి చైర్మన్ దూకుడు

వేములవాడ, ఏప్రిల్ 18 ( ప్రజా కలం ప్రతినిధి) : వేములవాడ పట్టణ ముఖచిత్రాన్ని మార్చేయడమే లక్ష్యంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆయన శనివారం తన సొంత వార్డు అయిన 15వ వార్డులో పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించారు.మురికి కాల్వల పూడికతీత పనులను దగ్గరుండి పరిశీలించిన చైర్మన్, పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని అధికారులకు స్పష్టం చేశారు. యంత్రాంగాన్ని చురుకుగా పనిచేయిస్తూ పారిశుధ్య పనులను వేగవంతం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో పట్టణ ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల నివారణ, వ్యాధుల నియంత్రణ కోసం ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పారిశుధ్యంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధిపైనా దృష్టి సారించిన చైర్మన్, వార్డులో కొత్త విద్యుత్ దీపాల ఏర్పాటు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు రూ.4.20 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. ఇప్పటికే కొలతల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 15వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతానని,అలాగే పట్టణంలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేసి వేములవాడను సర్వాంగ సుందరంగా మారుస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు.మున్సిపల్ కార్యాలయానికే పరిమితం కాకుండా ప్రతిరోజు వార్డుల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న చైర్మన్ విధానం స్థానికులను ఆకట్టుకుంటోంది. అభివృద్ధి విషయంలో రాజీ పడని ధోరణితో ముందుకు సాగుతున్న ఆయన పనితీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఏఈ అనన్యతో పాటు మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.





## ఆడిట్ కు గ్రామ సంఘాల పుస్తకాలు సిద్ధంగా ఉంచాలి

### - ఐకెపి ఎపిఎం రామనారాయణ గౌడ్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 18 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండల మహిళా సమాఖ్య నెలవారి కార్యవర్గ సమావేశం అధ్యక్షురాలు పావని అధ్యక్షతన శనివారం నిర్వహించామని ఐకెపి ఎపిఎం రామ్ నారాయణ గౌడ్ తెలిపారు. ఈ సమావేశంలో మండల మహిళా సమాఖ్య ఆర్థిక అంశాలు, గ్రామ సంఘాల, చిన్న సంఘాల సంస్థ గత నిర్మాణం, ఆర్థిక అభివృద్ధి, వ్యాపార కార్యక్రమాల గురించి చర్చించామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సర అంతర్గత ఆడిట్ కు అన్ని గ్రామ సంఘాల పుస్తకాలు సిద్ధంగా ఉంచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ సంఘాల పదాధికారులు, మండల సమాఖ్య అకౌంటెంట్ మహేష్, సీసీలు సంధ్య, రమేష్, గోపాల్, సుజాత పాల్గొన్నారు.



## పొలం గట్టు పైనే పోయిన రైతన్న ప్రాణం

### - అడివి లింగాలలో వడదెబ్బతో రైతు మృతి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 18 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం ఆడివిలింగాల గ్రామానికి చెందిన లింగాల రాములు (59) అనే రైతు వడదెబ్బకు గురై మృతి చెందిన విషాద ఘటన శు



క్రవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం... రాములు ఉదయం తన పొలంలో పనులు ముగించుకుని సాయంత్రం సుమారు 4 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అనంతరం మరో పొలానికి నీళ్లు పార బెట్టేందుకు వెళ్లిన రాములు రాత్రి వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అతడిని వెతుకుతూ కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లగా రాములు పొలం గెట్టు పై అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,అతడిని వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు బాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

## చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి...

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 18 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మాటూరి మల్లేష్ (33) అనే వ్యక్తి చేపల వేటకు వెళ్లి నిజాంసాగర్ బ్యాక్ వాటర్ లో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మాటూరు మల్లేష్ తన మిత్రుడు సాయితో కలిసి శనివారం ఉదయం రుద్రారం గ్రామ శివారులో నిజాంసాగర్ బ్యాక్ వాటర్ లో చేపల వేటకు వెళ్ళాడు. చేపలు పడుతూ మరో గట్టుకు వెళ్లే సమయంలో వలను తన వెంట పెట్టుకుని నీటిలో ఈదుకుంటూ వెళ్తుండగా ఆవల అతడి కాళ్లకు చుట్టుకుని ఈదరాకుండా చేసింది. దీంతో ఊపిరాడక మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





# పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

### - ముగ్గురు జూదరుల అరెస్ట్...

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 18 ప్రజా కలం : ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగమయ్యపల్లి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జూదమాడుతున్న పేకాట శిబిరంపై మెరుపు దాడి చేసి ముగ్గురు జూదరులను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పక్క సమాచారం మేరకు మండలంలోని జంగమయ్య పల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుండి 20,160 రూపాయల నగదు, మొబైల్ ఫోన్, రెండు మోటార్ సైకిళ్ల ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.

జూదం అనేది ఒక వ్యసనం మాత్రమే కాక అది కుటుంబం ఆర్థిక పునాదులను కూల్చే సామాజిక మహమ్మారి అన్నారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు పేకాట, రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉ




ంచి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వేల్లడించారు. ప్రజలు ముఖ్యంగా యువత ఇలాంటి అనైతిక చర్యలకు దూరంగా ఉండి బాధ్యతాయుతంగా మెలగాలని ఆయన సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని ఎవరైనా ఎంతటి వారైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

# నియంత్రత్వాన్ని ప్రజాస్వామ్యం ఓడించింది

### డీలిమిటేషన్ బిల్లు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం:కూనంనేని సాంబశివరావు



ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) డీలిమిటేషన్ బిల్లు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, నియంత్రత్వాన్ని ప్రజాస్వామ్యం ఓడించిందని భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం హిమాయత్ నగర్ లోని రాజ్ బహదూర్ హాల్లో సీపీఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సమితి కార్యవర్గ సమావేశానికి కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఈసందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ...నిన్న పార్లమెంట్ లో కేంద్ర ప్రభుత్వ మోడీ, అమిత్ షా ద్వయం నియత్రుత్వంగా డిలీమిటేషన్ బిల్లు ప్రవేశపెట్టడం దాన్ని ప్రతిపక్షాలన్ని ఏకమై బిల్లుని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడయన్నారు. డీలిమిటేషన్ బిల్లు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ముప్పుగా నిలుస్తోందన్నారు. ప్రజల ప్రతినిధిత్వాన్ని సమానంగా కల్పించాల్సిన ప్రక్రియను రాజకీయ లాభాల కోసం వక్రీకరించే ప్రయత్నంగా ఈబిల్లు కనిపిస్తోందని ఏద్దేవా చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియ అనేది జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించడం కోసం ఉండాలి, అయితే ఈ బిల్లు ద్వారా కొన్ని రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ముఖ్యంగా దక్షిణ భారత రాష్ట్రాలపై వివక్ష చూపుతూ, ఉత్తర భారత రాష్ట్రాలకు రాజకీయంగా అధిక ప్రాధాన్యత ఇవ్వాలనే కుట్ర అని అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు సమాన విలువ కలిగి ఉండాలి. ఈ బిల్లు అమలు అయితే ప్రాంతాల మధ్య అసమానతలు మరింత పెరిగి, సమతుల్యత కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. సీపీఐ తరపున వేము ఈబిల్లును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు . ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా పారదర్శకత లేకుండా ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం అప్రజాస్వామికమని వివరించారు.

మహిళా బిల్లును 2023లోనే పార్లమెంట్ ఆమోదం పొందిందని మళ్ళీ నేడు పునర్విభజన పేరుతో మహిళా బిల్లును ఉపసంహరించుకోవడం వెనుకాల బీజేపీ అసలు కుట్ర మహిళా రిజర్వేషన్ ను అడ్డుకోవడమేనని బీజేపీ చేసే అబద్ధపు ప్రచారాన్ని అడ్డుకోవాలన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు పార్టీగా పూర్తి మద్దతు ఉందని స్థానిక నాయకత్వం పాల్గొని విజయవంతం చెయ్యాలన్నారు. రాబోవు రోజుల్లో పార్టీ బలోపేతం కొరకు స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కారం కోసం ప్రయత్నిస్తే పార్టీ బలోపేతం అవుతుందని, కార్పొరేషన్ ఎన్నికల్లో నిలబడే స్థానాలపై ద్రుష్టి సారించి గెలిచే విధంగా ప్రయత్నం చెయ్యాలని దానికి రాష్ట్ర పార్టీ తరపున మద్దతు ఉంటుందన్నారు. ప్రజలు సిపిఐ పార్టీ వైపు ఆలోచిస్తున్నారని సిపిఐ నాయకత్వం ప్రజలను కలుసుకొని వారికి భరోసా కల్పించి పార్టీ ఎదుగుదలకు కృషి చేయాలని కోరారు.అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివెస్ బోస్ మాట్లాడుతూ... డబుల్ బెడ్రూం షాప్ లకు ఓపెన్ టెండర్ పిలవడం వల్ల ఉన్నవారికే కేటాయించడం జరుగుతుందని, స్థానిక నిరుద్యోగులకు ఇస్తే బాగుటుందని, దానికోసం పోరాటం చేయాలన్నారు. డబుల్ బెడ్రూమ్ ల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి రాబోయే రోజుల్లో వారికి కేటాయించాలని, పోరాటం నిర్వహించాలని పార్టీ నాయకత్వం పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ఈసమావేశం లక్ష్మి అధ్యక్షతన జరగ్గా, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్ రెడ్డి, కల్లూరు ధర్మేంద్ర, సాయిలు గౌడ్, స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, కృష్ణ, హరినాథ్ రావ్, రచ్చ కిషన్, శంకర్ రావ్, సత్య ప్రసాద్ లతో పాటు అన్ని మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి నీ పరిశీలించిన కాయకల్ప బృందం సభ్యులు




గజ్వేల్:18 ఏప్రిల్ 2026 (ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో శనివారం కాయకల్ప ఎక్స్టర్నల్ అసెస్మెంట్ నిర్వహించారు. నిజామాబాద్ డిసిఎస్ డాక్టర్.శ్రీనివాస్ ప్రసాద్, ఇబ్రహీంపట్నం సూపరిండెంట్ డాక్టర్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో కాయకల్ప బృందం గజ్వేల్ దవాఖానను పరీక్షించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ పుష్ప గుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. కాయకల్ప సభ్యులు డాక్టర్.శ్రీనివాస్ ప్రసాద్,డాక్టర్ రాజ్ కుమార్ దవాఖానలోని వివిధ వార్డులు ఆపరేషన్ థియేటర్,లేబర్ రూమ్,స్వచ్ఛత నిర్వహణ,వేస్ట్ మేనేజ్మెంట్ తదితర అంశాలలో దవాఖాలను క్షుణ్ణంగా పరిశీలించి గ్రేడింగ్ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.

అనంతరం వారు ఆసుపత్రి నిర్వహణ తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ శ్రీధర్,ప్రణిత, వైద్య సిబ్బంది నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ ఫార్మసీ ఆఫీసర్ విమల ఎఫ్సిబా,శ్రీనివాస చారి, మోహన్ బండారి,సానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మి,ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్స్ మేహారాజ్ భాను,రజిత,హెడ్ నర్సెస్, జగదాంబ ఉమామహేశ్వరి వకుల దేవి, నిర్మల. పుష్ప. హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, కృష్ణవేణి, ఇమ్యునైజేషన్ డిపార్ట్మెంట్ లతా, కనుక లక్ష్మి, భారతమ్మ ,ఈ సీ.జీ టెక్నీషియన్ రాజు ఆరోగ్యశ్రీ ఇన్చార్జి సురేందర్,సంతోష్,కనకయ్య, పారిశుధ్య విభాగ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.







## డాక్టర్ చికిత్స... నర్సు సంరక్షణ- ఈ రెండూ కలిస్తేనే ప్రాణ రక్షణ

### ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 130 - సుభాష్ నగర్ డివిజన్ సూరారం భీమా గార్డెన్స్ లో సీతారాం స్కూల్ డ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, బిబిఆర్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డ ఓత్ టేకింగ్ సెరిమోని కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిధిగా హాజరై నూతనంగా నర్స్ కోర్సులో పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి ప్రశాంగించారు.




ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....డాక్టర్ చికిత్స... నర్సు సంరక్షణ -- ఈ రెండూ కలిస్తేనే ప్రాణ రక్షణ అని అన్నారు. వైద్య వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరూ వైద్యం కోసం వచ్చిన వారిని రోగిగా కాకుండా తమ సొంత వారిగా భావించి వైద్య సేవలు అందించినప్పుడే మీకు మంచి పేరు లభిస్తుందన్నారు.

ఈకార్యక్రమంలో కళాశాల యాజమాన్యం దాక్షాయని, శ్రీమతి రేఖ, డాక్టర్ చంద్ర క్రిష్ణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు వారాల వినోద్, శివాజీ, గుబ్బల లక్ష్మీ నారాయణ, రాజ్ కుమార్, ప్రభాకర్, కోల శ్రీకాంత్ ముదిరాజ్, రవి, వేణు ముదిరాజ్, ప్రశాంత్ రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## లాల్ సాహెబ్ గూడా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తాం

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 125 – గాజుల రామారం డివిజన్ లాల్ సాహెబ్ గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ సందర్శించి పాఠశాలలో పిల్లలకు అందుతున్న సౌకర్యాలు, తరగతి గదులను పర్యవేక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... పిల్లల బంగారు భవిష్యత్తుకు అవసరమైన అన్నీ వసతులను కల్పించడంతో పాటు అదనపు తరగతి గదులను నిర్మించి పాఠశాలను అభివృద్ధి పరుస్తామన్నారు. ఈకార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## చిల్డ్రన్స్ క్లినిక్ ను ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ .

సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 18( ప్రజా కలం):

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మియాపూర్ లోని మాధవ్ నగర్ లో ప్రణయ చిల్డ్రన్ క్లినిక్ ను శనివారం నాడు ప్రారంభించారు. సందర్భంగా క్లినిక్ లో ఉన్న ఆధునిక ఎక్విప్మెంట్ ను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలలో మౌలిక వసతుల కల్పన కు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. హైదరాబాద్ నగరం హెల్త్ హబ్ గా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వ రంగంలో ఉచితంగా మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో సామాన్యుడికి అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు వైద్య సౌకర్యాలను బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు అరికెపూడి గాంధీ, ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ ప్రణయ, డాక్టర్ కె.వి. తేజారెడ్డి లు పాల్గొన్నారు.



# పేరుకే అది పెద్ద షాపింగ్ మాల్

## అక్కడ వస్తువులన్నీ గడువు మీరినవే
## అధికారులకు పిర్యాదు చేసినా చర్యలు శూన్యం
## రిలయన్స్ షాపింగ్ మాల్ ను సీజ్ చేయాలని ప్రజల డిమాండ్









**యాదాద్రి భువనగిరి : ఏప్రిల్18 ప్రజా కలం ప్రతినిధి :**
అదొక జిల్లా కేంద్రం, అక్కడొక రిలయన్స్ సంస్థ పెద్ద షాపింగ్ మాల్, వినియోగదారులకు అక్కడ అన్ని రకాల వస్తువులు దొరుకుతాయి. అంతవరకు బాగానే ఉంది. కానీ అసలు సమస్య ఏంటంటే అక్కడ ఉన్న వస్తువులన్నీ గడువు మీరినవే ఉంటాయి. ఎంత చదువుకున్న వారైనా ఆ వస్తువులు కొనాల్సిందే, ఎవరైనా షాపింగ్ మాల్ యాజమాన్యం ను అడిగితే.. చాలా సింపుల్ గా "సారీ చూసుకోలేదు వేరేది తీసుకోండి" అంటారు. గడువు తీరిన వస్తువులను ప్రజలకు అంటగట్టి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రిలయన్స్ సంస్థ ఆగడాలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయి డబ్బులు ఖర్చు పెట్టి మరీ రోగాలు కొనాల్సిన గత్యంతరం వినియోగదారులకు పట్టింది. పాల డబ్బాలు మొదలుకొని ప్రతి వస్తువు అక్కడ గడువు మీరినవే ఉంటాయి. ఎప్రిల్ మాసంలోనే మూడు ఫిర్యాదులు వచ్చాయి. అయినా ఆ షాపింగ్ మాల్ యాజమాన్య వైఖరి మారడం లేదు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు షాపింగ్ మాల్ పై చర్యలు తీసుకోవాలి

యాదాద్రి భువనగిరి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు రిలయన్స్ సంస్థ షాపింగ్ మాల్ పై ఆకస్మికంగా తనిఖీ చేసి, తగిన చర్యలు తీసుకోవాలని వినియోగదారుల హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు కొడారి వెంకటేష్ డిమాండ్ చేస్తున్నారు. రిలయన్స్ సంస్థ షాపింగ్ మాల్ లో చాలా వరకు గడువు తీరిన వస్తువులను అమ్మడం, అధికారులు పట్టించుకోకపోవడం వల్ల వినియోగదారులు ఆర్థికంగా, ఆరోగ్య పరంగా నష్టపోయే ప్రమాదం ఉంది. జిల్లా ఆహార భద్రత అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# కూల్చివేతలు సరికాదు

## జిహెచ్ఎంసి అధికారులపై మండిపడ్డ మాజీ మంత్రి, ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 18,(ప్రజా కలం)
మాజీ మంత్రి, ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి మండిపాటు బడంగ్ పేట్ సర్కిల్ పరిధిలో జిహెచ్ఎంసి అధికారులు రోడ్లకు ఇరువైపుల కుల్చి వెతలు చేపట్టడం సబబు కాదని మండిపడ్డారు. ఎలాంటి నోటీసులు లేకుండా ఎలా కూల్చివేతలు చేపట్టారని అధికారులపై




ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బడంగ్ పేట్ సర్కిల్ బాలాపూర్ చౌరస్తా నాదర్ గుల్ ప్రధాన రహదారి కి ఇరువైపుల రోడ్లను ఆక్రమించి వేసిన రేకుల షెడ్లు ర్యాంపులు మెట్ల జిహెచ్ఎంసి అధికారుల కూల్చివేతలను మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి స్థానిక బిఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి పరిశీలించారు. కూల్చివేతలు సరైన పద్ధతి పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇచ్చి, వారికి కొంత సమయం ఇచ్చి కూల్చివేతలు చెట్టాలన్నారు. ఇష్టం వచ్చినట్లు ఆస్తులను ధ్వంసం చేయడం భావ్యం కాదని హితవు పలికారు. రోడ్డు విస్తరణ మ్యాపు ప్రకారం ముందస్తుగా నోటీసులు ఇచ్చి స్తంభాలను తొలగించి రోడ్డు విస్తరణ సమయంలో ఇరువైపులా ఉన్న వాటిని లాగించాలన్నారు. ఇవేవి లేకుండానే జిహెచ్ఎంసి అధికారులు తమకు ఇష్టం వచ్చినట్టుగా పోలీసు బందోబస్తు ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేయడం మంచిది కాదని హెచ్చరించారు రోడ్డు విస్తరణ పై ఒక రెండు రోజుల్లో అధికారులతో చర్చించి తగిన పరిష్కారం ఆలోచించినట్లు ఆమె చెప్పారు. అప్పటివరకు ఎలాంటి కూల్చివేతలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీక

## - సదాశివపేట పట్టణం లోని హజరత్ మహబూబ్ పాశ దర్గా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న టి పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి.

సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 18( ప్రజా కలం):
సదాశివపేట పట్టణం లోని హజరత్ మహబూబ్ పాశ దర్గా లో జరిగిన ఉర్సు ఉత్సవాల్లో టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. గత మూడు రోజులు గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ దర్గా లో హజరత్ సయ్యద్ షా మహమ్మద్ సాహబ్ 422 వ ఉర్సే షరీఫ్ మరియు హజరత్ మహబూబ్ పాశ 52 వ ఉర్సే షరీఫ్ ఉత్సవాలు సంయుక్తంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా జరిగిన కవ్వాలి కార్యక్రమం ఆహుతులను అలరించింది. కవ్వాలి కార్యక్రమం నిర్వాహకులను, దర్గా కమిటీ సభ్యులను జగ్గారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని, కవ్వాలి కార్యక్రమం బాగుందని నిర్వాహకులను అభినందించారు.



# కాలేయ ఆరోగ్యం కాపాడుకుందాం

## - ఆరోగ్యకర జీవనశైలితో వ్యాధులకు చెక్





ప్రజా కలం ప్రత్యేకం..

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రజా కలం ప్రతినిధి)

**ప్రతి సంవత్సరం ఏప్రిల్ 19న ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని జరుపుకుంటారు. కాలేయ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన జీవనశైలి మరియు సరైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం.**

### కాలేయం మన శరీరానికి అత్యంత ముఖ్యమైన అవయవం


మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాలలో కాలేయం ఒకటి. ఇది శరీరంలోని విషపదార్థాలను తొలగించడం, రక్తాన్ని శుద్ధి చేయడం, పోషకాలను ప్రాసెస్ చేయడం, జీర్ణక్రియను మెరుగుపరచడం వంటి కీలక బాధ్యతలను నిర్వహిస్తుంది. అదేవిధంగా రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో కూడా కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది.అయితే, ఆధునిక జీవనశైలిలో పెరిగిన చెడు అలవాట్లు కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా మద్యం సేవనం, ప్రాసెస్డ్ ఫుడ్స్ వినియోగం, అధిక కొవ్వు మరియు చక్కెరలతో కూడిన ఆహారాలు కాలేయ వ్యాధులకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.




| కాలేయానికి హానికరమైన ఆహారాలు | కాలేయానికి మేలు చేసే ఆహారాలు |
|---|---|
| ఆల్కహాల్ | ఆకుకూరలు, తాజా కూరగాయలు |
| ప్రాసెస్డ్ ఫుడ్స్ | నట్స్ |
| అధిక కొవ్వు పదార్థాలు | ఆలివ్ ఆయిల్ |
| షుగర్ అధికంగా ఉండే పానీయాలు | యాపిల్స్ |
| ప్యాకేజ్డ్ ఫుడ్స్ | బ్లూబెర్రీస్ |
| అధిక ఉప్పు | బీట్‌రూట్ |
| | గ్రీన్ టీ |

### కాలెయ వ్యాధుల లక్షణాలు


- ఎప్పటికప్పుడు అలసటగా అనిపించడం
- కళ్లకు, చర్మానికి పసుపు రంగు (జాండిస్)
- కుడి వైపు పొత్తికడుపులో నొప్పి
- ముదురు రంగులో మూత్రం
- వికారం, వాంతులు



**ఈ లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి**

### నిపుణుల సూచనలు

యోగ మరియు లైఫ్‌స్టైల్ నిపుణులు చెబుతున్నదాని ప్రకారం, అధికంగా చక్కెరతో కూడిన పానీయాలు తీసుకోవడం వల్ల కాలేయంపై భారం పెరుగుతుంది. దీనివల్ల 'నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (NAFLD)' వచ్చే ప్రమాదం ఉంది. గ్లూకోజ్ మాత్రమే కాకుండా ఫ్రక్టోజ్ కూడా కాలేయానికి హానికరమేనని వారు హెచ్చరిస్తున్నారు. పండ్లలో కూడా ఫ్రక్టోజ్ ఉండటంతో వాటిని పరిమితంగా తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ప్రాసెస్డ్ ఫుడ్స్, వేపుళ్లు, షుగర్ డ్రింక్స్ తగ్గిస్తూ, మాంసాహారం మరియు మద్యం మితంగా తీసుకోవడం ద్వారా కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



Dr. M.Manohar Reddy DSM

### ముగింపు



ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం – ఇవే కాలేయాన్ని కాపాడే మూడు ప్రధాన ఆయుధాలు. ఈ ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి సారించి, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయాలి.

**కాలేయాన్ని కాపాడండి – ఆరోగ్యంగా జీవించండి!**

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com